జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి శనివారం 7 మార్చి 2026 సంపుటి : 1 సంచిక : 64 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం

- దేశానికి మార్చి చివరికల్లా నక్సలిజం నుంచి విముక్తి
- నక్సలిజం నిర్మూలనలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించింది
- రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలనుకున్న వారిని భద్రతాదళాలు ఓడించాయి

5లో

# మూసీ చుట్టూ నైట్ టూరిజం



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- హైదరాబాద్‌లో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం
- బుద్వేల్ వద్ద ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఇంటర్‌ఛేంజ్ నిర్మాణానికి శంకుస్థాపన
- హైదరాబాద్‌లో కొత్వాల్‌గూడ ఎకో హిల్ పార్కు ప్రారంభం

హైదరాబాద్

శంషాబాద్-న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని మూసీ నది పరిసర ప్రాంతాల్లో నైట్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన రివర్‌ఫ్రంట్‌ల వల్ల అక్కడ అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ప్రజల్ని ఒప్పించి, మెప్పించి హైదరాబాద్ నగరాన్ని ఘనంగా అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. తాను ఏ పనిచేయాలని తలపెట్టినా.. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అడ్డుపడుతున్నారని ఆక్షేపించారు. ఆ పద్ధతి మానుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్ సమీపంలోని కొత్వాల్‌గూడలో బుద్వేల్ వద్ద బాహ్య వలయ - మిగతా2లో



## మన టాప్ ర్యాంక్ 23

- సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల టాప్ ర్యాంకర్‌గా శ్రీజశ్వంత్‌చంద్ర
- 55వ ర్యాంకు సాధించిన పెద్దపల్లికి చెందిన సృజన
- జోధ్‌పూర్ ఎంబీబీఎస్ వైద్యుడు అనూజ్ అగ్నిహోత్రికి ఫస్ట్ ర్యాంక్
- చెన్నైకి చెందిన రాజేశ్వరి సువేకు రెండో ర్యాంక్..
- ఢిల్లీవాసి ఆకాన్ష్ ధుల్‌కు మూడో ర్యాంక్
- సివిల్స్-2025 తుది ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ

హైదరాబాద్

సివిల్స్-2025 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ఏపీలోని కాకినాడకు చెందిన జీను శ్రీజశ్వంత్‌చంద్ర ఆలిండియా 23వ ర్యాంక్ సాధించగా తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన గూడెల్లి సృజన 55వ ర్యాంకు సాధించారు. తెలంగాణకు చెందిన 20 మందికి వెయ్యిలోపు ర్యాంకులు లభించాయి. ఈ మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - మిగతా2లో



భారత వ్యవసాయ ఉత్పత్తులు

## ప్రపంచంతో పోటీ పడాలి

- ప్రధాని మోదీ
- వ్యవసాయ ఉత్పత్తుల ప్రమాణాలను, నాణ్యతను, బ్రాండింగ్‌ను ప్రోత్సహించాలి
- భారత వ్యవహాయ ఉత్పత్తులకు ప్రపంచ గుర్తింపు రావాలి
- దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలి

5



సామ్రాట్ చౌధరీ నిత్యానందరాయ్

## బిహార్ తదుపరి సీఎం ఎవరు?

- రేసులో సామ్రాట్ చౌధరీ, నిత్యానందరాయ్!
- భాజపా సామాజిక వ్యూహంతోనే బడుగు, బలహీన వర్గాలకే సీఎం పీఠం కట్టబెట్టవచ్చనే ఊహాగానాలు
- బిహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌధరీ- ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు



## దాడులు.. ఉద్ధృతం

- టెహ్రాన్‌పై యుద్ధవిమానాలతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- లెబనాన్‌పైనా బాంబుల వర్షం
- ఇరాన్ డ్రోన్ వాహకనౌకను ధ్వంసం చేసిన అమెరికా
- ప్రతీకార దాడులను ముమ్మరం చేసిన టెహ్రాన్
- కువైట్, ఖతార్, సౌదీ, బహ్రెయిన్‌లపైకి క్షిపణులు, డ్రోన్ల ప్రయోగం
- సంధి ప్రసక్తే లేదు.. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి: ట్రంప్

5

# నేను అందరివాడిని

- మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ కృతజ్ఞత సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పేదల ఆశయ సాధనకు తప్పకుండా కృషి చేస్తా
- బర్రెలు, గొర్రెలిస్తే కాదు.. ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే మాదిగలు అభివృద్ధిలోకి వచ్చినట్లు
- ప్రభుత్వం వద్ద పంచేందుకు భూములు లేవు... నాణ్యమైన విద్య అందిస్తాం
- మీ జాతి బిడ్డలు డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు కావాలి



హైదరాబాద్

బలహీనుల పక్షాన నిలబడే మొదటి వ్యక్తిగా ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. సామాజికంగా, ఆర్థికంగా బలహీనులుగా ఉన్న వారికి అండగా నిలిచి వారి లక్ష్య సాధన కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా మందకృష్ణ, సతీశ్ మాదిగ తదితరులు కలిసినప్పుడు అండగా నిలిచానన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీలో తొలి ప్రకటన చేసింది తమ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో కృతజ్ఞత సభ నిర్వహించింది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఎస్సీ వర్గీకరణ అంశం దశాబ్దాలపాటు నలిగింది. ఎలాగైనా వర్గీకరణ సాధించాలన్న తపనతో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఎన్నో చిక్కుముడులు, కమిషన్లు, తర్జనభర్జనలు జరిగాయి. 20 ఏళ్లుగా ఈ సమస్యను ప్రత్యక్షంగా - మిగతా2లో

# మూసీ చుట్టూ నైట్ టూరిజం



-మొదటిపేజీ తరువాయి
రహదారి (ఓఆర్ఆర్)కి అనుసంధానంగా ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ నిర్మాణానికి శుక్రవారం సీఎం శంకుస్థాపన చేశారు. కొత్వాల్‌గూడ ఎకో హిల్ పార్కును ప్రారంభించి మొక్క నాటారు. బ్యాటరీ వాహనంలో పార్కులో కలియ తిరిగారు. ఈ కార్యక్రమాలతో హైదరాబాద్ నుంచి ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. దీంతో రాష్ట్రమంతటా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమైంది.

**ఎవరినీ నిరాశ్రయులను చేయం**
“రేడియల్ రోడ్లు నిర్మించాలన్నా.. బుల్లెట్ ట్రైన్ రావాలన్నా కొందరు స్థలాలు తీసుకోక తప్పదు. వారికి భూమి పోయిన దుఃఖం ఉంటుంది. మరోచోట అంత భూమిని కొనుక్కోడానికి తగిన నష్టపరిహారం ఇచ్చే బాధ్యత నాది. మిమ్మల్ని అనాథలను చేయను. ఎవరినీ నిరాశ్రయులను చేయం. ఏ నియోజకవర్గంలో ఉన్నవారికి అక్కడికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను చూసి ఇళ్లు కట్టించేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాం. ప్రపంచంలోనే గొప్ప నగరాన్ని ఈ ప్రాంతంలో నిర్మిస్తున్నాం. ఇప్పుడు ఇక్కడ నిర్మిస్తున్న జంక్షన్ వల్ల ప్రపంచంతోనే పోటీపడే అభివృద్ధి జరుగుతుంది. మన నగరంలో చారిత్రక కట్టడాలను చూడటానికి విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కానీ, అభివృద్ధికి కొంతమంది గుంపులుగా వచ్చి అడ్డుపడుతున్నారు.

**ఆక్రమణలకు గురైన నగరం**
మన వారు ఇక్కడ నుంచి వెళ్లి విదేశాలలో సినిమాలు తీస్తుంటారు. కానీ, హైదరాబాద్ కంటే సుందరమైన నగరం ప్రపంచంలోనే లేదు. నగరం ఎంత సుందరమైనదైనా పాలకులు మంచివారై ఉండాలి. చంద్రబాబు, వైఎస్సార్ అధికారంలో ఉన్నప్పుడు అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. వరదల నుంచి నిజాం పాలకులు ప్రజలను, నగరాన్ని కాపాడారు. నాటి నుంచి ఇప్పటి వరకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు హైదరాబాద్‌వాసుల దాహార్తిని తీరుస్తున్నాయి. ఇంతటి ఘన చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఆక్రమణలకు గురైంది. ఎంత మంచి నగరమైనా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటేనే సుందరంగా ఉంటుంది. ఇది చేద్దామనుకుంటే.. కొంతమంది అడ్డుపడుతున్నారు. మరో 5 సంవత్సరాల్లో ఇక్కడి పరిస్థితి పూర్తిగా మారబోతోంది.
బుల్లెట్ రైళ్లు వస్తాయి. గంటల్లోనే ఇతర రాష్ట్రాల్లోని నగరాలకు ప్రయాణించవచ్చు. శంషాబాద్ ప్రాంతం బుల్లెట్ ట్రైన్ల హబ్‌గా మారనుంది. ఇందిరమ్మ చీరల్లో ఆడబిడ్డలు పాలపిట్టల్లా మెరిసిపోతున్నారు. గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరలను పిట్టలు కొట్టడానికి వాడారు. ఈసారి మరో రంగుతో ఇందిరమ్మ చీర ఇస్తాం” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సీఎం వెంట ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లు రవి, రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్నారు. ఖ

# మన టాప్ ర్యాంక్ 23

-మొదటిపేజీ తరువాయి
(యూపీఎస్సీ) శుక్రవారం తుది ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 1,087 పోస్టులు ఖాళీగా ఉండగా తుది ఫలితాల్లో 659 మంది పురుషులను, 299 మంది మహిళలను కలిపి మొత్తంగా 958 మందిని సివిల్స్ విజేతలుగా యూపీఎస్సీ ప్రకటించింది. టాప్ 25 ర్యాంకులు సాధించిన వారిలో 14 మంది పురుషులు ఉండగా 11 మంది మహిళలు ఉన్నారు. మొత్తం అర్హుల్లో 317 మంది జనరల్ కేటగిరీ వారుకాగా 306 మంది ఓబీసీలు, 158 మంది ఎస్సీలు, 73 మంది ఎస్టీలు, ఉన్నారు.
అలాగే ఆర్థికంగా వెనుకబడిన (ఈడబ్ల్యూఎస్) విభాగం నుంచి 104 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించారు. అలాగే ఐఏఎస్‌కు 180 మంది, ఐపీఎస్‌కు 150 మంది, ఐఎఫ్ఎస్‌కు 55 మంది, కేంద్ర సర్వీసుల (గ్రూప్––ఏ)కు 507 మంది, గ్రూప్–బీ సర్వీసులకు 195 మంది ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది. సివిల్స్ ప్రిలిమ్స్‌ను 5,76,793 మంది రాయగా 14,161 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వారిలో 2,736 మంది మాత్రమే ఇంటర్వ్యూ దశకు చేరుకున్నారు.రి

**గతేడాదికన్నా సంఖ్య తగ్గింది**
సివిల్స్–2025 ఫలితాల్లో ఏపీ, తెలంగాణ అభ్యర్థుల సంఖ్య గతేడాదితో పోలిస్తే కొద్దిగా తగ్గింది. గతేడాది రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలకు సన్నద్ధత వల్ల అభ్యర్థులు సివిల్స్‌పై ఎక్కువ దృష్టి సారించలేకపోయారు. విజేతల్లో ఎ క్కువ శాతం మంది ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారు, సివిల్స్ రీ–అటెంప్ట్ చేసిన వారే ఉన్నారు. తొలిసారి పరీక్ష రాసిన వారి సంఖ్య తక్కువగానే ఉంది.

**అనూజ్ అగ్నిహోత్రి టాపర్**
రాజస్తాన్‌కు చెందిన అనూజ్ అగ్నిహోత్రి జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచాడు. అనూజ్ ఎయిమ్స్ జోధ్‌పూర్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. తొలి ప్రయత్నంలో ఢిల్లీ, అండమాన్––నికోబార్ దీవుల సివిల్ సర్వీసు (డీఏఎన్ఐసీఎస్)లకు ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్న అతను తాజాగా మూడో ప్రయత్నంలో ఆలిండియా టాపర్‌గా సివిల్స్‌కు ఎంపికయ్యాడు. చెన్నైకి చెందిన రాజేశ్వరి సువే తన రెండో ర్యాంకు సాధించారు.
అన్నా యూనివర్సిటీ నుంచి బీటెక్ చేసిన ఆమె ఐదో ప్రయత్నంలో సివిల్స్ సాధించారు. అలాగే ఢిల్లీ యూనివర్సిటీ కామర్స్ గ్రాడ్యుయేట్ ఆకాన్‌ఈ?ష ధుల్ మూడో ర్యాంక్ పొందారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన బీఏ ఎకనామిక్స్ గ్రాడ్యుయేట్ భార్గవ్ ఝున్‌ఝున్‌వాలా నాలుగో ర్యాంకు సాధించగా ఢిల్లీ లా యూనివర్సిటీ నుంచి బీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్) చేసిన ఇషాన్ భట్న?నగర్ ఐదో ర్యాంకు పొందారు.

**ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్నందుకే ఈ ఫలితం: అనూజ్**
సివిల్స్ ఫలితాల విడుదల అనంతరం అనుజ్ అగ్నిహోత్రి మీడియాతో మాట్లాడుతూ ‘ఈ విజయం అనిర్వచనీయ అనుభూతిని కలిగిస్తోంది. గత రెండు ప్రయత్నాల్లో ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని అంకిత భావంతో సన్నద్ధం కావడం వల్లే ఈ ఫలితం లభించింది’అని పేర్కొన్నాడు. మరోవైపు ఆలిండియా టాపర్‌గా నిలిచిన అనుజ్ అగ్నిహోత్రికి రాజస్తాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లా అభినందనలు తెలిపారు.

**ఐపీఎస్ టు ఐఏఎస్..**
23వ ర్యాంక్ సాధించిన కాకినాడకు చెందిన జీను శ్రీజశ్వంత్ చంద్ర ఐఐటీ కాన్పూర్‌లో బీటెక్ చేశారు. 2018లో బెంగళూరులో శామ్‌శాంగ్ సంస్థలో మూడేళ్లపాటు ఉద్యోగం చేశారు. సివిల్స్ కోసం ఉద్యోగానికి స్వస్తిపలికి 2020లో తొలి ప్రయత్నంలో ర్యాంక్ రాకపోయినా మరో ప్రయత్నంగా 2021లో రాసి 314వ ర్యాంక్ సాధించి పోస్టల్ శాఖలో ఉద్యోగం పొందారు. 2022లో మరోసారి సివిల్స్ రాసి ఐఆర్ఎంఎస్‌తోపాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీసులోనూ కొలువు సాధించారు.
2023లో సివిల్స్‌లో ఆలిండియా స్థాయిలో 162వ ర్యాంక్ సాధించి ఐపీఎస్ ఏపీ కేడర్‌కు ఎంపికయ్యారు. అప్పటి నుంచీ హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతూనే ఐఏఎస్ కోసం 2024లో మళ్లీ పరీక్ష రాశారు. 390వ ర్యాంక్ రావడం, లక్ష్యం నెరవేరకపోవడవంతో మరింత సాధన చేసి 2025లో మరోసారి పరీక్ష రాసి 23వ ర్యాంక్‌తో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శ్రీజశ్వంత్ చంద్ర తండ్రి మాణిక్యాలరావు కుటుంబం పిఠాపురం నుంచి జగ్గంపేట వెళ్లి స్థిరపడింది. తల్లి వరలక్ష్మి ఉపాధ్యాయిని.

**సింగరేణి కార్మికుడి కుమార్తెకు 55వ ర్యాంకు**
సివిల్స్ ఫలితాల్లో సింగరేణి కార్మికుడి కుమార్తె జాతీయ స్థాయిలో 55వ ర్యాంకుతో సత్తా చాటింది. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన గుడెల్లి రాజేశం––రాణి దంపతుల కుమార్తె గుడెల్లి సృజన ఆరో ప్రయత్నంలో విజయం సాధించింది. తండ్రి రాజేశం ఆర్జీ––3 ఏరియాలోని ఓసీపీ వన్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంథని జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేశాక.. 2018లో ఢిల్లీ వెళ్లి శిక్షణ తీసుకుంది.

**అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే..**
‘మేము ముగ్గురం పిల్లలం. ఐఏఎస్ కావాలనే నా కలను అమ్మానాన్నలు వారి కలగా మార్చుకున్నారు. నా ప్రయత్నాలను ప్రోత్సహించారు. గతేడాది ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కి వచ్చా. మరోసారి ప్రతి?ంచాలని ప్రోత్సహించారు. గ్రూప్––1 రాసి డీఎస్పీగా శిక్షణ తీసుకుంటూనే మరోసారి సివిల్స్‌కి ప్రిపేరయ్యా. అమ్మానాన్నల మాట ఈరోజు నిజమైంది. అప్పటి కరీంనగర్ కలెక్టర్ స్మితాసబర్వాల్‌ను స్ఫూర్తిగా తీసుకొని సివిల్స్‌కు ప్రిపేరయ్యా. మహేశ్ ఎం.భగవత్ సర్ సలహాలతో ఈరోజు సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించా.’

**ఐఎఫ్ఎస్ వచ్చినా ఐఏఎస్‌పై గురి**
103వ ర్యాంకు సాధించిన బిపుల్ గుప్తా విశాఖవాసి. ఆయన తండ్రి విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ పవన్ కుమార్ గుప్తా. 2024 సివిల్స్ పరీక్షల్లో బిపుల్‌కు 368వ ర్యాంకు రావడంతో ఐఎఫ్ఎస్ అధికారిగా ఏపీ కేడర్‌లో చేరారు. ప్రస్తుతం డెహ్రాడూన్‌లో శిక్షణ పొందుతున్నారు. అయినా ఐఏఎస్ లక్ష్యంగా మళ్లీ సివిల్స్ రాసి ఇప్పుడు 103వ ర్యాంకు సాధించారు. బిపుల్ 2022లో ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశారు. తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్ సాధించిన బిపుల్ గుప్తా తల్లి డాక్టర్ దీప గుప్త ప్రముఖ యూట్యూబర్. ఈసారి ఐఏఎస్ లభించే అవకాశం ఉందని బిపుల్ తెలిపారు.

**నాలుగో ప్రయత్నంలో 393వ ర్యాంకు**
సివిల్స్‌లో మూడుసార్లు విఫలమైనా పట్టుదలతో చదివి నాలుగో ప్రయత్నంలో 393వ ర్యాంకు సాధించారు తిరుపతికి చెందిన యారాశి తుషారికరెడ్డి. ఆమె తండ్రి వై.ఎం. గురువారెడ్డి తిరుపతి బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి, తల్లి మల్లీశ్వరి టీటీడీలో సూపరింటెండెంట్. తుషారిక చెన్నైలోని ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బీటెక్ చేశారు. ప్రస్తుతం ఐఆర్ఎస్ లేదా ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ పోస్టు రావచ్చని ఆమె అంచనా వేస్తున్నారు.

## 10న బీఆర్ఎస్ వర్క్‌షాప్ !

హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌నకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 10న హైదరాబాద్ శివారులోని ఓ రిసార్టులో దీనికోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అంశాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి. ప్రొఫెసర్ నాగేశ్వర్, అసెంబ్లీ మాజీ కార్యదర్శి సదారాం తదితరులను వక్తలుగా ఆహ్వానించినట్టు తెలిసింది. ఈ వర్క్‌షాప్‌నకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అసెంబ్లీ నిర్వహణ తీరుతెన్నులు, సభా నియమావళితోపాటు రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, వాటిని శాసనసభ సమావేశాల్లో లేవనెత్తాల్సిన తీరు తదితరాలపై నిపుణులు సూచనలు, సలహాలతోపాటు అవగాహన కల్పిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. తర్వాతి దశల్లో కింది స్థాయి నాయకులు, క్రియాశీల కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తోంది.

**‘అంబేడ్కర్ విగ్రహం’పై ఉద్యమం**
మూసీ సుందరీకరణ పేరిట భారీ గాంధీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హుస్సేన్‌సాగర్ తీరాన ఏర్పాటు చేసిన భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని పట్టించుకోకపోవడంపై ఉద్యమించాలని పార్టీ నిర్ణయించింది. ఈ నెల 10న ప్రారంభించే ‘అంబేడ్కర్ విగ్రహం’ఉద్యమ కార్యక్రమాన్ని వచ్చే నెల 14న జరిగే అంబేడ్కర్ జయంతి నాటికి తీవ్ర స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహ ప్రాంగణాన్ని మూసివేసి సందర్శకులకు కూడా అనుమతి ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. గ్రామ, మండల, జిల్లా స్థాయి మొదలుకొని దశలవారీగా అవసరమైతే ఢిల్లీ స్థాయికి ఉద్యమం తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో చేపట్టిన సాగర హారం తరహాలో ఏప్రిల్ 14న హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రభుత్వ ఆంక్షల నుంచి విముక్తి కల్పించాలనే డిమాండ్‌తో హుస్సేన్‌సాగర్ చుట్టూ మానవహారం నిర్వహించే యోచనలో ఉంది. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగతోపాటు వివిధ దళిత సంఘాలు, ప్రజా సంఘాల నేతలతో త్వరలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ నేతలు భేటీ అవుతారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆంక్షలు విధించడంపై త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు కొత్తగా ఏర్పడిన మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల పరిధిలో విస్తృతంగా పార్టీ కార్యకలాపాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. గ్రేటర్ కార్పొరేషన్లకు మరో రెండు నెలల్లోపే ఎన్నికలు జరుగుతాయని అంచనా వేస్తోన్న బీఆర్ఎస్ ఆ లోపే పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలని భావిస్తోంది. కేటీఆర్ ఇప్పటికే గ్రేటర్‌లో ఇఫ్తార్ విందులు, ఇతర పార?టల నుంచి నేతల చేరికలు వంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

## నేను అందరివాడిని

-మొదటిపేజీ తరువాయి
చూస్తూ వచ్చిన నేను మీరు కొట్లాడిన ప్రతి సందర్భంలో నా చేతనైనా సాయం చేస్తూ వచ్చా. అసెంబ్లీలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు నాటి పాలకులు సండ్ర వెంకటవీరయ్య, సంపత్ కుమార్‌తోపాటు నన్ను సభ నుంచి బయటకు గెంటేశారు. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టిన ప్రజాప్రభుత్వం.. వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయడంతోపాటు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసింది. అలాగే వన్ మ్యాన్ కమిషన్‌ను నియమించి ఆ కమిషన్ నివేదిక ఆధారంగా వర్గీకరణ అమలు చేసింది. ఇలా అన్నీ వేగంగా, విజయవంతంగా పూర్తి చేశాం. వర్గీకరణ అన్ని సమస్యలకు పరిష్కారం చూపించకపోవచ్చు. కానీ వీలైనంత వరకు పరిష్కారం చూపే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. పదోన్నతులు, ఉన్నత విద్య, లిడ్‌క్యాప్ భూముల పరిరక్షణ లాంటి సమస్యల పరిష్కారం పెద్ద విషయం కాదు. ప్రభుత్వం మీ సమస్యలను ముందుండి పరిష్కరిస్తున్నప్పుడు వెనుక నుంచి జరిగే దాడులను మీరే ఆపాలి. మీరే నాకు అండగా నిలవాలి. నిరంతరం అప్రమత్తంగా ఉండి సమస్యలను అర్థం చేసుకొని ముందుకెళ్లాలి’అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు అన్నీ ప్రభుత్వ ఉద్యోగులేనని.. ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

**మిత్రధర్మం... పేదల పక్షం...**
‘మహాభారతంలో అర్జునుడు, కృష్ణుడు అందరికీ ఇష్టమే. కానీ నాకు కర్ణుడు, బార్బరికుడంటే అభిమానం. కర్ణుడు మిత్రధర్మాన్ని చివరి వరకు పాటించాడు. ఘటోత్కచుడి కుమారుడు బార్బరికుడు మాత్రం బలహీనుల పక్షాన నిలబడి పోరాడాడు. నేను కూడా బలహీనుల ఆశయ సాధన, సమస్యల పరిష్కారంలో ముందుంటా. వర్గీకరణ విషయంలో న్యాయం ఉంది. మీరు బలహీనులు కాబట్టే రాజకీయపరమైన ఒత్తిడి వచ్చినా మాదిగల పక్షాన నిలబడ్డా. నా ప్రయత్నంలో మంత్రివర్గ సహచరులు, అధికారులు సమయస్ఫూర్తి చూపి అండగా నిలబడ్డారు’అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

**నా శక్తి ఉన్నంత వరకు సాయం చేస్తా..**
రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ప్రస్తుతం పంచేందుకు భూములు లేవు. అలాగే ఆర్థిక వెసులుబాటు పరిమితంగా ఉంది. ఈ నేపథ్యంలో దారిద్ర్యరేఖలో ఉన్న మాదిగ జాతి ముందుకు నడవాలంటే విద్య అవసరం. అందుకే నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచాం. విద్య ఒక్కటే మీ జీవితంలో మార్పు తెస్తుంది. గత ప్రభుత్వం పేదలకు బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చామని చెప్పింది. చెప్పులు కుట్టుకొమ్మంది. బర్రెలు, గొర్రెలు, చేపలతో కాదు.. మీ జాతి బిడ్డలంతా కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు కావాలి. ఉన్నత స్థానాల్లోకి ఎదగాలి. తెలంగాణ పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కావాలి. నా శక్తి ఉన్నంత వరకు మీకు సాయం చేస్తా. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జగ్జీవన్‌రామ్ కుమార్తె మీరాకుమార్ ఎలా పనిచేశారో అదే స్ఫూర్తితో నేనూ పనిచేస్తా. ఎస్సీ వర్గీకరణ చేసినప్పుడు నన్ను రేవంత్ మాదిగ అన్నారు. ఇంకొన్ని పేర్లతోనూ పిలిచారు. నన్ను ఎలా పిలిచినా ఇబ్బంది లేదు.. నేను అందరి వాడిని’అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

**ఎనిమిది నెలల్లోనే పూర్తి: మంత్రి దామోదర**
రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను 8 నెలల్లోనే పూర్తి చేసి చరిత్ర సృష్టించామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తదుపరి నిమిషమే సీఎంకు అసెంబ్లీలో సమాచారం ఇచ్చానని, వెంటనే సీఎం స్పందించి అసెంబ్లీలో ప్రకటన చేశారని.. కేవలం గంట వ్యవధిలోనే ఈ ప్రక్రియ పూర్తయిందన్నారు. వర్గీకరణతో ఉద్యోగాలు, విద్యలో మాదిగలకు అవకాశాలు పెరుగుతాయని.. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు సబ్‌ప్లాన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.

**గ్రూప్––1 ఉద్యోగాలు వచ్చాయి: అడ్లూరి**
ఎస్సీ వర్గీకరణ అమలుతో అత్యంత పేద కుటుంబాలకు గ్రూప్––1 లాంటి ఉద్యోగాలు వచ్చాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. వర్గీకరణ వల్లే 778 మందికి వైద్య విద్యలో ప్రవేశాలు, ఇంజనీరింగ్ సీట్లు వచ్చాయన్నారు. దశాబ్దాల క్రితం కొట్లాడిన దానికి ఇప్పుడు ఫలితాలు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.

## చెర వీడుతున్నాయ్.. చెరువులు మారుతున్నాయ్

హైదరాబాద్

భాగ్యనగరంలో చెరువులు అంటే మురుగుకూపాలే అన్న భావన క్రమంగా మారుతోంది. అటువైపు వెళ్తే దుర్వాసన భరించలేమన్న రోజులు పోయి ఓ పదినిమిషాలు అక్కడ ఆగి చల్లనిగాలులు ఆస్వాదించాలనేలా అవి రూపుమార్చుకుంటున్నాయి. కాలుష్యంతో నిండిపోయిన తటాకాలను హైడ్రా దశల వారీగా తీర్చిదిద్దుతోంది. కబ్జాలపాలైన ఎకరాల కొద్దీ చెరువుల భూములను చెరవిడిపిస్తోంది. చెత్తకుప్పలు, ముళ్ల కంపలు పోయి ఆ స్థానంలో పచ్చని చెట్లు, చక్కని బెంచీలు కనిపిస్తున్నాయి. ఉదయాన్నే వ్యాహ్యాళి, సాయంత్రం పిచ్చాపాటి కబుర్లు.. సెలవు రోజు కుటుంబంతో ఓ పిక్నిక్‌లా గడపండి అంటూ చెరువు కట్టలు పిలుస్తున్నాయి. చెత్తకుప్పలతో నిండిన అంబర్‌పేట బతుకమ్మ కుంటకు బతుకునిచ్చినట్లుగానే మరో రెండు చెరువులకు హైడ్రా పురుడుపోసింది. కొత్త రూపు సంతరించుకున్న పాతబస్తీలోని బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువును సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు. కూకట్‌పల్లి నల్లచెరువు సోమవారం ప్రారంభానికి సింగారించుకుంటోంది. ఇవి కూకట్‌పల్లిలోని నల్లచెరువు చిత్రాలు. 14.32 ఎకరాలకు కుంచించుకుపోగా ఆక్రమణల తొలగింపు అనంతరం విస్తీర్ణం 29.58 ఎకరాలకు చేరుకుంది. సుందరీకరణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది

**ఒక్కో అడుగు.. 275 ఎకరాలకు చేరి**
నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎస్ఏ) నివేదిక ప్రకారం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 920 చెరువుల ఉండగా 282 పూర్తిగా మాయమయ్యాయి. 209 పాక్షికంగా ఆక్రమణల పాలయ్యాయి. కుంటలు, చెరువుల పేర్లు మాత్రమే మిగిలిన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. ఉన్న వాటిలోనూ మురుగు, కాలుష్యం చేరుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం 2024 జులై 19న హైడ్రాను ఏర్పాటు చేసింది. కమిషనర్‌గా ఏవీ రంగనాథ్‌ను నియమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు యాభైకి పైగా చెరువుల్లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. దీంతో 275 ఎకరాల విస్తీర్ణం చెర వీడింది. కబ్జాల తొలగింపుతోనే సరిపెట్టకుండా సుందరీకరణను ఒక బాధ్యతలా చేపట్టింది. మొదటి దశలో ఆరు చెరువులను రూ.107.77 కోట్లతో బాగు చేస్తోంది. ఏడాది కిందట అంబర్‌పేట బతుకమ్మకుంట ప్రాంతాన్ని చూస్తే ఒక పెద్ద చెత్తకుప్పల దిబ్బగా ఉండేది. ఆ ప్రాంతానికి చేరుకోగానే ముక్కుపుటాలు అదిరే దుర్వాసన వచ్చేది. ఇప్పుడు ఆ ప్రాంతం ఒక ఉద్యానవనంలా మారింది. మొదట ఆక్రమణల తొలగింపుపై దృష్టిపెట్టిన హైడ్రా మాదాపూర్ తమ్మిడికుంటలోని ప్రముఖుల చేతుల్లో నుంచి కబ్జాలను తొలగించింది. మాదాపూర్‌లోని సున్నంచెరువు విస్తీర్ణం 16.41 ఎకరాలకు తగ్గిపోగా ఆక్రమణలు తొలగించిన అనంతరం 30.5 ఎకరాలకు చేరుకుంది. ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఉప్పల్ నల్లచెరువు కబ్జాలతో 52.5 ఎకరాలకు కుంచించుకుపోగా వాటిని తొలగించడంతో 67.31 ఎకరాలకు చేరుకుంది. సుందరీకరణ పనులు పురోగతిలో ఉన్నాయి. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల ఎగువన ఫామ్‌హౌస్‌లు, హోటళ్ల నిర్మాణాలను తొలగించింది. అభివృద్ధి పనుల్లో భాగంగా పూర్తి నీటి మట్టం స్థాయి నిర్ధారించి అలుగు నిర్మాణం, హద్దులు వేయడం, పూడికతీత, మురుగు దారిమళ్లింపు చేపడుతున్నారు.

# దాడులు.. ఉద్ధృతం

దుబాయ్

పశ్చిమాసియాలో యుద్ధజ్వాల ఇప్పట్లో ఆరిపోయే సంకేతాలు కనిపించడం లేదు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు జరుపుతూనే ఉన్నాయి. ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్ సహా పలు దేశాలపై దాడుల ఉద్ధృతిని పెంచుతోంది. దీంతో ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మరోవైపు– బేషరతుగా లొంగిపోవాలని టెహ్రాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దానితో చర్చలేమీ ఉండబోవని స్పష్టం చేశారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎంపికలో తన పాత్ర ఉంటే మంచిదని కూడా పేర్కొన్నారు.

**టెహ్రాన్‌పై 50 యుద్ధవిమానాలతో..**

యుద్ధం ఏడో రోజైన శుక్రవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకొని దాదాపు 50 యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. సుప్రీం లీడర్ నివాస ప్రాంగణంలో నిర్మించిన భూగర్భ బంకర్‌ను ధ్వంసం చేసింది. సంక్షోభ సమయాల్లో సుప్రీం లీడర్‌ను అత్యవసరంగా తరలించేందుకు ఏళ్ల తరబడి శ్రమించి ఈ బంకర్‌ను నిర్మించారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. సీనియర్ అధికారులు సమావేశమయ్యేందుకు అందులో గదులు కూడా ఉన్నాయని తెలిపింది. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో ఇళ్లు భూకంపం వచ్చిందన్నట్లుగా కంపించాయి. కెర్మాన్షా నగరంలోనూ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. కెర్మాన్షాలో పలు క్షిపణి స్థావరాలు ఉన్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లలో 40 శాతం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, వాటిని నాశనం చేసి తీరుతామని ఇజ్రాయెల్ సైన్యం స్పష్టంచేసింది.

**లెబనాన్‌పై భీకర దాడులు**

హెజ్‌బొల్లా తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకొని లెబనాన్‌లో రాజధాని బీరుట్ శివార్లతో పాటు పలు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. అంతకుముందే టెల్ అవీవ్ హెచ్చరికలు జారీ చేయడంతో.. 95 వేలమందికిపైగా బీరుట్ శివారు ప్రాంతాలు, దక్షిణ లెబనాన్‌ను విడిచి వలస వెళ్లారు. బీరుట్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం సమీపంలోనూ ఇజ్రాయెల్ దాడి చేసినట్లు సమాచారం.

**ఎడతెరిపి లేకుండా విరుచుకుపడుతున్న అమెరికా**

ఇరాన్ యుద్ధనౌకలపై అమెరికా ఎడతెరిపి లేకుండా దాడులు చేస్తోంది. ఆ దేశ డ్రోన్ వాహకనౌక ఐరిస్ షాహిద్ బగేరీపై తాము దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఆ నౌక మంటల్లో చిక్కుకున్న వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఐరిస్ షాహిద్ బగేరీ దాదాపు రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి విమానవాహక నౌక పరిమాణంలో ఉంటుందని తెలిపింది. దీనిపై డ్రోన్ల ప్రయోగం కోసం 180 మీటర్ల రన్‌వే ఉంటుంది. ఇది ఒక్కసారి ఇంధనం నింపుకొంటే.. 22 వేల నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించగలదు. ఇరాన్‌లో 200 లక్ష్యాలపై తాజాగా తాము దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. భూగర్భ లక్ష్యాలపైనా బంకర్ బస్టర్లను జారవిడిచినట్లు పేర్కొంది.

**క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడులు**

పశ్చిమాసియాలో ప్రతీకార దాడులను ఇరాన్ ముమ్మరం చేసింది. దాడుల్లో భారీ ఖొర్రమ్‌షహర్–4 క్షిపణులను కూడా అది ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా బలగాలకు ఆతిథ్యమిస్తున్న కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లపైకి టెహ్రాన్ శుక్రవారం ఉదయం క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. ఆ దేశాల్లో ఎంత ప్రాణ/ఆస్తి నష్టం వాటిల్లిందనేది స్పష్టంగా తెలియరాలేదు.

తమ దేశంలోని అల్ ఉదెయిద్ వైమానిక స్థావరంపైకి దూసుకొచ్చిన ఓ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఖతార్ రక్షణ శాఖ తెలిపింది.

రియాధ్‌కు దక్షిణాన ఉన్న ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్ వైపు దూసుకొచ్చిన మూడు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా వెల్లడించింది. రియాధ్ సమీపంలో మరో డ్రోన్‌ను ధ్వంసం చేశామని, ఖర్జ్ నగరంపైకి దూసుకొచ్చిన ఓ క్రూజ్ క్షిపణిని అడ్డుకున్నామని కూడా తెలిపింది.

ఇరాన్ దాడులతో తమ దేశంలో రెండు హోటళ్లు, ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు బహ్రెయిన్ పేర్కొంది. ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ శుక్రవారం రెండు దఫాలుగా దాడులు కొనసాగించింది. ఆ దేశ రాజధాని టెల్ అవీవ్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

ఇరాన్ లొంగిపోతే..: ట్రంప్

ఇరాన్‌తో శాంతి చర్చలు ఉండబోవని ట్రంప్ సంకేతాలిచ్చారు. ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం తప్ప.. మరే ఒప్పందానికీ తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇరాన్ లొంగిపోతే.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తామన్నారు. "ఇరాన్ లొంగిపోయాక.. అక్కడ అందరికీ ఆమోదయోగ్యమైన నాయకత్వం ఎంపికయ్యాక– ఆ దేశాన్ని విధ్వంసం అంచుల నుంచి వెనక్కి తీసుకొచ్చేందుకు అమెరికా, సాహసోపేతమైన మా భాగస్వామ్య పక్షాలు అలుపెరుగని కృషి చేస్తాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను ఇంతకుముందెన్నడూ లేనంతగా బలోపేతం చేసేందుకు శ్రమిస్తాయి" అని సోషల్ మీడియా పోస్టులో ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ బలగాలు ఆయుధాలు త్యజించాలని పిలుపునిచ్చారు. తన మాట వినకుండా యుద్ధం చేయాలనుకుంటే ప్రాణాలు కోల్పోవడం తప్ప ఏమీ జరగదని హెచ్చరించారు. తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందన్నారు. అయితే ఆ విషయంలో ఇప్పటికే ఆలస్యమైందని ఆ దేశానికి చెప్పినట్లు తెలిపారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎంపిక ప్రక్రియలో తనకు భాగస్వామ్యం ఉంటే మంచిదని ట్రంప్ ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో అభిప్రాయపడ్డారు. ఆయతుల్లా ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీయే నూతన సుప్రీం లీడర్‌గా నియమితులయ్యే అవకాశాలు ఉన్నాయన్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. మొజ్తాబాను సాదాసీదా వ్యక్తిగా పేర్కొన్నారు. ఇరాన్‌కు శాంతి, సామరస్యాలను అందించే వ్యక్తే పాలనా పగ్గాలు చేపట్టాలని ట్రంప్ అభిప్రాయపడ్డారు. 'ఇరాన్‌ను తిరిగి మీ అధీనంలోకి తీసుకోండి' అని ఇరాన్ ప్రజలకు ఆయన మరోసారి పిలుపునిచ్చారు. యుద్ధం ముగింపునకు తమ దేశం విజ్ఞప్తి చేయలేదని, అమెరికాతో చర్చలను ప్రతిపాదించలేదని ఈజిప్టులో ఇరాన్ రాయబారి మొజ్తాబా ఫెర్దౌసీ పౌర్ స్పష్టం చేశారు.

మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభం: పెజెష్కియాన్

ప్రస్తుత ఘర్షణకు ముగింపు పలికే దిశగా కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ప్రారంభించాయని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ శుక్రవారం అన్నారు. సంబంధిత పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

కొత్త సుప్రీం లీడర్ నియామకం దిశగా ఇరాన్‌లో అడుగులు పడుతున్నాయి. సుప్రీం లీడర్‌ను ఎంపిక చేసే 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' కమిటీని ఎలా సమావేశపరచాలన్న విషయంపై దేశ నాయకత్వ మండలి శుక్రవారం చర్చించింది. ఈ మండలిలో దేశాధ్యక్షుడు పెజెష్కియాన్, న్యాయ విభాగం అధిపతి గొలామ్ హొసేన్ మొహసెనీ ఎజెహి, మతపెద్ద ఆయతుల్లా అలీ రెజా అరాఫీ సభ్యులుగా ఉన్న సంగతి తెలిసిందే.

**204 మంది ఇరాన్ నావికులను కొలంబోకు తరలించిన శ్రీలంక**

ఇంజిన్ వైఫల్యం కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న ఇరాన్ నౌక 'ఐరిన్స్ బుషెహర్' నుంచి 204 మంది నావికులను శ్రీలంక నౌకాదళం గురువారం సురక్షితంగా కొలంబోకు తరలించింది. మరో నలుగురు ఇరానీ నావికులు నౌకలోనే ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుతం కొలంబో సమీపంలో ఉన్న ఐరిన్స్ బుషెహర్.. ట్రింకోమలీ రేవుకు చేరుకోవడానికి కనీసం మరో రెండు రోజులు పడుతుందని పేర్కొంది. ఇంజిన్ వైఫల్యం తలెత్తడంతో.. శ్రీలంక జలాల్లో ప్రవేశించేందుకు ఐరిన్స్ బుషెహర్ అనుమతి కోరినట్లు ఆ దేశ నౌకాదళం అధికార ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ చెప్పారు.

ఐరిస్ దేనా యుద్ధనౌకను అమెరికా ముంచేసిన ఘటనలో తాము స్వాధీనం చేసుకున్న 84 మంది ఇరానియన్ల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేశామని శ్రీలంక తెలిపింది. నౌకలో ప్రాణాలతో బయటపడ్డ 32 మంది నావికులు ఇంకా చికిత్స పొందుతున్నారని పేర్కొంది.

**ఐరిస్ దేనాను ముంచేసినందుకు ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్**

శ్రీలంక తీరంలో తమ యుద్ధనౌకను అమెరికా ముంచేయడంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఆ చర్యకు తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఐరిస్ దేనాలో ఆయుధాలేవీ లేవని పేర్కొంది. భారత్‌లో పర్యటిస్తున్న ఇరాన్ విదేశాంగ శాఖ ఉప మంత్రి సయీద్ ఖతిబ్జదేహ్ శుక్రవారం ఈ మేరకు స్పందించారు.

**కొచ్చిలో ఇరాన్ నౌక**

ఇరాన్‌కు చెందిన ఐరిస్ లావన్ నౌకను కొచ్చిలో నిలిపి ఉంచేందుకు భారత్ అనుమతించింది. అందులోని 183 మంది సిబ్బందికి ఆశ్రయం కల్పించింది. విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చి తిరిగి వెళ్తుండగా నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొచ్చిలో అత్యవసర నిలుపుదలకు ఇరాన్ విజ్ఞప్తి చేసిందని, దీంతో ఈ నెల 1న సంబంధిత అనుమతి మంజూరు చేశామని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈ నెల 4న నౌకను ఇరాన్ కొచ్చిలో నిలిపిందని పేర్కొన్నాయి.

**ఖమేనీని చంపాలని నవంబరులోనే నిర్ణయించుకున్నాం: కట్జ్**

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ హత్య గురించి ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తాజాగా కీలక విషయాలు బయటపెట్టారు. ఖమేనీని చంపాలని నిరుడు నవంబరులోనే.. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తాము నిర్ణయించుకున్నట్లు ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌పై చేస్తున్న మిలిటరీ ఆపరేషన్‌ను నిజానికి ఈఏడాది మధ్యలో మొదలుపెట్టాలనుకున్నామని చెప్పారు. అయితే ఇరాన్‌లో ఈ ఏడాది ఆరంభంలో పెద్దఎత్తున పౌరనిరసనలు చెలరేగడంతో.. అమెరికాతో కలిసి ముందుగానే ఆపరేషన్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

**ఖతార్‌లోని భారతీయులకు సూచనలు**

ఖతార్‌లోని భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. వీసా, ప్రయాణాల విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఖతార్‌లో చిక్కుకుపోయిన భారతీయులు సౌదీ అరేబియా మీదుగా ప్రయాణించేందుకు తాత్కాలిక ట్రాన్సిట్ వీసా సౌకర్యాన్ని కల్పించేందుకు రిజిస్ట్రేషన్ లింక్‌ను అందుబాటులోకి తెచ్చింది. అత్యవసర పరిస్థితుల్లో ఖతార్ నుంచి సౌదీకి వెళ్లేందుకు సాల్వా అనే భూసరిహద్దు మార్గం ఉందని, ప్రస్తుతం అది తెరిచే ఉందని కూడా తెలిపింది.

**అమెరికాకు మేం నిఘా సమాచారమివ్వలేదు: భారత్**

ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనాకు సంబంధించి అమెరికాకు తాము నిఘా సమాచారమేదీ అందించలేదని భారత నౌకాదళ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ వ్యవహారంలో తమపై వస్తున్నవన్నీ అసత్య, నిరాధార ఆరోపణలేనంటూ కొట్టిపారేశాయి. శ్రీలంక తీరంలో ఐరిస్ దేనాను అమెరికా బుధవారం ముంచేసిన సంగతి తెలిసిందే. మరోవైపు– ఐరిస్ దేనా వ్యవహారంలో అంతర్జాతీయ మానవ సహాయ ఒప్పందం మేరకు, అంతర్జాతీయ రక్షణ విధులకు లోబడి.. శ్రీలంక నౌకాదళంతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నామని భారత నౌకాదళ వర్గాలు తెలిపాయి.

**ఇప్పటివరకూ 200 మంది చిన్నారుల మృతి**

ప్రస్తుత యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఇప్పటివరకూ దాదాపు 200 మంది చిన్నారులు మృత్యువాతపడ్డారని యూనిసెఫ్ తెలిపింది. వీరిలో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించింది. లెబనాన్‌లో ఏడుగురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు మరణించారని పేర్కొంది.

# దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం

దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోదీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ లేదా తెలంగాణలో నక్సలిజాన్ని నిర్మూలించడంలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఒడిశా కటక్‌జిల్లాలోని ముండలిలో జరిగిన సీఐఎస్ఎఫ్ 57వ వార్షికోత్సవంలో పాల్గొన్న అమిత్ షా తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కనేవారి కలలను భద్రతా దళాలు కల్లలు చేశాయన్నారు. "ఈ సందర్భంగా దేశప్రజలకు ఒక విషయం స్పష్టం చేయాలనుకుం టున్నా. 2026 మార్చి 31 నాటికి దేశం నక్సల్స్‌రహితంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి నుంచి నేపాల్?లోని పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కన్నవారిని భద్రతాదళాలు పూర్తిగా ఓడించి తమ ఆధిపత్యం చాటుకోనున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో భద్రతాదళాలకు ఇది అతిపెద్ద విజయం కానుంది." 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్? మారాలంటే అంతర్గత భద్రత చాలా కీలకమని అమిత్? షా పేర్కొన్నారు. దేశంలోని కీలక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నాయని చెప్పారు. దేశంలోని వివిధ జలాశయాలు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, పార్లమెంట్ వంటి ముఖ్యమైన ప్రాంతాలకు రక్షణను అందిస్తున్నాయని చెప్పారు. అయితే, దేశంలో శాంతి వాతావరణం నెలకొన్నప్పుడే ఆర్థిక వృద్ధి సాకారమవుతుందని షా చెప్పుకొచ్చారు. అదేవిధంగా, దేశాన్ని ప్రపం చంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే పరిశ్రమల అభివృద్ధి అవసరమని షా నొక్కి చెప్పారు. అయితే, ఆ బాధ్యతను సీఐఎస్ఎఫ్ సమర్థంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సీఐఎస్ఎఫ్ స్థాపించి 56 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆ దళాలు సాధించిన పురోగతిని అమిత్ షా ప్రశంసించారు. సీఐఎస్?ఎఫ్? చిన్న స్థాయిలో ప్రారంభమై, ప్రస్తుతం పారిశ్రామిక భద్రత రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని కొనియాడారు. దేశ చరిత్రలో ధైర్యం, త్యాగం, అంకితభావంతో ఈ దళం ప్రతి సవాల్‌ను సమర్థంగా ఎదుర్కొందని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. సీఐఎస్?ఎఫ్? లేకుండా దేశ పారిశ్రామిక అభివృద్ధి దార్శనికతను ఊహించలేమన్నారు. మరోవైపు, దేశంలోని అన్ని ఓడరేవుల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రైవేట్ పరిశ్రమలకు కూడా హైబ్రిడ్ విధానంలో భద్రత అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం!**

అదేవిధంగా, 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు అమిత్? షా. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని సాధించడం, అలాగే 2027 నాటికి దేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడం, అనే ఈ తీర్మానాలను ప్రధానమంత్రి ప్రజల ముందు ఉంచారని ఆయన ఎత్తి చూపారు.

**కేంద్ర హెంమంత్రికి ఘన స్వాగతం పలికిన ఒడిశా సీఎం**

ఇదిలా ఉండగా, వివిధ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనడానికి శుక్రవారం ఒడిశాకు చేరుకున్న అమిత్? షాకు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ భువనేశ్వర్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం భువనేశ్వర్‌లో రూ.890 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న రెండు నివాస ప్రాజెక్టులను ప్రారంభించారు. దాంతో పాటు మూడు రిజర్వ్ బెటాలియన్‌లకు షా శంకుస్థాపన కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్? మాఝీ, అసెంబ్లీ స్పీకర్ సురామ పాఢీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్? తదితరులు పాల్గొన్నారు.

## బిహార్ తదుపరి సీఎం ఎవరు?

పట్నా: బిహార్‌లో తొలిసారి భాజపా సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నీతీశ్‌కుమార్ త్వరలో రాజ్యసభకు వెళ్లనుండటంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. దీంతో భాజపా నుంచి ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరు చేపడతారనే విషయమై తీవ్రచర్చ మొదలైంది. సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, ఉప ముఖ్యమంత్రి విజయ్‌సిన్హా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

బడుగు, బలహీన వర్గాలకే...

భాజపా సామాజిక వ్యూహంతోనే బడుగు, బలహీన వర్గాలకే సీఎం పీఠం కట్టబెట్టవచ్చనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బిహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌధరీ–ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు. ఈ వర్గానికి ఇప్పటివరకు సీఎం అయ్యే అవకాశం రాలేదు. ఆయనను పెద్ద నాయకుడిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. సామ్రాట్ చౌధరీ ఆర్జేడీ నుంచి వచ్చి పదేళ్లు కూడా కాకపోవడంతో భాజపా అధినాయకత్వం ఆయనపై ఎంతవరకు విశ్వాసం చూపుతుందన్నది ఆసక్తి రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అయోధ్య ఉద్యమ సమయం నుంచి ఏబీవీపీలో, ఆరెస్సెస్‌లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన బిహార్‌లో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు.

రాయ్‌కు అవకాశం ఇస్తే అగ్రవర్ణాలు, నీతీశ్ కుమార్ వర్గానికి చెందిన కుర్మీలు, ఇతర అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వ్యతిరేకత రావచ్చని భాజపా వర్గాలు భావిస్తున్నాయి. అగ్ర కులానికి చెందిన మంగళ్‌పాండే పేరు కూడా వినిపిస్తోంది. అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తికి సీఎం పదవి కట్టబెట్టాలని పార్టీ భావిస్తే సంజీవ్ చౌరాసియా పేరు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. వీరితో పాటు.. వెస్ట్ చంపారన్ ఎంపీ, రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ కు ఉపముఖ్యమంత్రి పదవి దక్కొచ్చన్న ప్రచారం జోరందుకుంది.

## భారత వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచంతో పోటీ పడాలి



వ్యవసాయ రంగాన్ని ఎగుమతుల ఆధారితంగా, ప్రపంచదేశా లతో పోటీపడే విధంగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు వ్యవసాయ రంగం నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతులు కలిపి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన మూడో వెబినార్‌లో 'వ్యవహాయం, గ్రామీణ పరివర్తన' అనే అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశ వ్యవసాయ ఉత్పత్తుల ప్రమాణాలను, నాణ్యతను, బ్రాండింగ్‌ను ప్రోత్సహించాల న్నారు. ఎగుమతులే లక్ష్యంగా సేంద్రీయ, సహజ వ్యవసా యాన్ని బలోపేతం చేయాలని ప్రధాని మోదీ అధికారులకు సూచించారు. పంటల వైవిధ్యీకరణపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టేలా రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. "వ్యవసాయం సుదీర్ఘకాలం నుంచి దేశాభివృద్ధికి వ్యూహాత్మక స్తంభంగా ఉంది. ఆ ఆలోచనతోనే మా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిరంతరం బలోపేతం చేసింది. దాదాపు 10కోట్ల మంది రైతులు 4 లక్షల కోట్లకుపైగా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా లబ్ధి పొందారు. ఎంఎస్‌పీ సంస్కరణల వల్ల రైతులకు ఒకటన్నర రెట్ల ఆదాయం లభిస్తోంది. సంస్థాగత క్రెడిట్ కవరేజీ 75శాతానికి పెరిగింది. పీఎం పసల్ యోజన ద్వారా 2లక్షల కోట్ల మేర బీమా చెల్లింపులు జరిగాయి. అనేక ప్రయత్నాల వల్ల రైతుల చాలావరకు నష్టాలు తగ్గాయి. వారికి ఆర్థిక భద్రత లభించింది. ఫలితంగా వ్యవసాయ రంగం ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది."

ఆ పంటలపై స్పెషల్ ఫోకస్

2026–27 బడ్జెట్?లో జీడిపప్పు, కోకో, శ్రీగంధం లాంటి అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించనట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. వంట నూనెలు, పప్పు ధాన్యాలపై ఒక జాతీయ మిషన్, అలాగే ప్రకృతి వ్యవసాయంపై మరో జాతీయ మిషన్? ఏర్పాటు వంటివి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని ఆయన అన్నారు. "మనం అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులను పెంచినప్పుడే, మన దేశ వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయిలో పోటీకి సిద్ధంగా మార్చగలం " అని మోదీ స్పష్టం చేశారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి

ప్రస్తుత ప్రపంచం ఆరోగ్యం పట్లల మరింత స్పృహతో ఉందని మోదీ అన్నారు. అందుకే సంపూర్ణ ఆరోగ్యం కోసం సేంద్రియ ఆహారంపై ప్రజలు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. "మనం రసాయన రహిత, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ఈ ప్రకృతి వ్యవసాయమే మన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరువ అయ్యేలా ఒక రహదారిని నిర్మిస్తుంది" అని మోదీ అన్నారు. భారత సుదీర్ఘ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయం ఒక వ్యూహాత్మక మూలస్తంభమని ఆయన నొక్కి చెప్పారు. తమ ప్రభుత్వం నిరంతరం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా దాదాపు 10 కోట్ల మంది రైతులు రూ.4లక్షల కోట్ల ఎక్కువ మొత్తాన్ని పొందారని మోదీ తెలిపారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ వ్యవసాయ, గ్రామీణ పరివర్తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

పాడి పరిశ్రమ పరిస్థితి ఏమిటి?

ఇక పాడి పరిశ్రమ గురించి కూడా మోదీ కీలక విషయాలు వెల్లడించారు. జంతువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్?) నుంచి రక్షించేందుకు, ఇప్పటి వర కు 125 కోట్ల కంటే ఎక్కువ డోసుల టీకాలను అందించామని చెప్పారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద సాంకేతికను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. "మా ప్రభుత్వ హయాంలో పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్? కార్డుల ద్వారా లబ్ధి చేకూరుతోంది. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పశుసంవర్ధక మౌలిక సదుపాయల అభివృద్ధి నిధిని (ఏహెచ్?ఐడీఎఫ్?)ను ప్రారంభించాం. మేను గోవర్ధన్ యోజనను అమలు చేస్తున్నాం. గోవర్ధన్ యోజనలో భాగంగా పశువ్యర్థాలను, చెత్తను వినియోగించుకుని, మన గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవచ్చు. పాల ద్వారా మాత్రమేకాదు, ఆవు పేడ ద్వారా కూడా ఆదాయాన్ని పొందవచ్చు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించాలని కోరుతున్నాను." కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడడం రైతులకు ప్రమాదకరమని గత అనుభవాల ద్వారా తెలుసుకున్నాం. పైగా ఇది ఆదాయ మార్గాలను కూడా పరిమితం చేసేస్తుంది. అందుకే మేము పంటల వైవిధ్యం (క్రాప్? డైవర్సిఫికేషన్)పై దృష్టి సారించాం. వాస్తవానికి వ్యవసాయం అనేది రాష్ట్రాల పరిధిలోని అంశం. రాష్ట్రాలకు భారీ వ్యవసాయ బడ్జెట్లు ఉన్నాయి. రాష్టాలు వాటి బాధ్యతలను నెరవేర్చడంలో సహాయపడడానికి, మా సూచనలు సద్వినియోగం అయ్యేలా చూడడానికి మేము నిరంతరం వారిని ప్రోత్సహిస్తాం. గ్రామాలకోసం, రైతుల కోసం రాష్ట్రాలు కేటాయించే ప్రతి పైసాను చాలా తెలివిగా వినియోగించాలి' అని అన్నారు.

## సంపాదకీయం

# నిజం నిప్పులాంటిది.. నివేదికలే సాక్ష్యం!

కలియుగ వైకుంఠంగా వాసికెక్కిన తిరుమల పుణ్య క్షేత్రంలో గత ఐదేళ్ల పాలనలో జరిగిన ఘోర అపచారం కోట్లాది మంది హిందువుల గుండెల్లో మంటలు రేపింది. శ్రీవారి ప్రసాదం అంటే కేవలం తినే పదార్థం కాదు, అది భక్తుల నమ్మకం, పరమ పవిత్రం. అటువంటి ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ల్యాబ్ రిపోర్టుల ద్వారా తేలడం నాగరిక సమాజం తలదించుకోవాల్సిన విషయం. తిరుమలలో జరిగిన ఈ మహా పాపంపై పశ్చాత్తాపం చెందాల్సింది పోయి, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులు చేస్తున్న బుకాయింపులు భక్తుల మనోభావాలను మరింత గాయ పరుస్తున్నాయి. భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ, తప్పు చేసి కూడా సమర్థించుకోవడం అనేది మరింత దారుణం. వైసీపీ నాయకుల బుకాయింపులు చెల్లవు.. వారు చేసింది మహాప రాధం. కల్తీ లడ్డు అనే ఆరోపణలు వచ్చినప్పుడు మొదటగా సంబంధిత అధికారులు పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షలకు పంపారు. నెయ్యి నాణ్యత ఏమిటి? ఉపయోగించిన పదార్థాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? అన్న విషయాలు ల్యాబ్ పరీక్షల ద్వారా నిర్ధారించబడ్డాయి. ఈ పరీక్షల నివేదికలు స్పష్టంగా చెబు తున్న విషయం ఏమిటంటే అభిప్రాయాలు కాదు, నివేదికలే నిజాలకు అద్దం పడుతున్నాయి.. గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) ఇచ్చిన నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు లార్డ్, చేప నూనె ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ సృష్టించిన రిపోర్ట్ కాదు.. భక్తులు, పోటు కార్మికులు చేసిన ఫిర్యాదుల మేరకు టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి ట్యాంకర్ల నుంచి 2024 జులై 16, 23 తేదీల్లో నమూనాలు తీసి సీల్డ్ కవర్లో ఎన్డీబీ–సీఏఎల్ఎఫ్ ల్యాబ్‌కి పంపగా, టీటీడీకి సరఫరా చేసే నెయ్యిలో వనస్పతి, జంతు కొవ్వుతో కల్తీ చేసినట్లు ల్యాబ్ నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగానే కేసు నమోదు చేసి సిట్ విచారణకు ఆదేశించింది కూటమి ప్రభుత్వం. పామోలిన్, ఇతర రసాయనాలతో తయారు చేసిన 60 లక్షల కిలోల నెయ్యి అనే పదార్థాన్ని డెయిరీలు సరఫరా చేశాయని.. దానితోనే 20 కోట్ల లడ్డూలు తయారు చేసినట్లు, అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న కల్తీ నెయ్యి సరఫరాదారుల్ని బెదిరించి వసూళ్ల కు పాల్పడినట్లు కూడా సిట్ విచారణలో వెల్లడైంది. కానీ సాక్ష్యాలు కళ్లముందు కనిపిస్తున్నా, వైసీపీ నాయకులు ఇది డైవర్షన్ పాలిటిక్స్ అనడం బాధ్యతా రాహిత్యం. చేసిన తప్పును ఒప్పుకోలేక, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి దేవుడిపైనే నిందలు వేయడం ఎంతవరకు సమంజసం? దీనిని రాజకీయ కోణంలో చూస్తూ తప్పించు కోవాలని చూస్తున్నారు.. కానీ ఇది రాజకీయాలకు అతీతమైన అంశం. ఒక మాజీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి, తన హయాంలో జరిగిన ఈ ఘోర అపచారానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. కల్తీ నెయ్యి వెనుక కుట్రలు, నివేదికలు వెనుక ఉన్న భయంకరమైన నిజాలు నెయ్యి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చేలా నిబంధనలు సడలిస్తూ కొనుగోలు కమిటీ సిఫారసు చేసింది. పామోలిన్, పామ్ కెర్నల్ ఆయిల్, బీటా కెరోటిన్, ఫ్లేవరింగ్ ఏజెంట్ల వంటి ఇతర రసాయనాలు ఉపయోగించి నెయ్యిని పోలి ఉండే రసాయనం తయారు చేసారని, ఇది నేరపూరిత కుట్రగా సిట్ తేల్చింది. శాస్త్రీయ నివేదికలు కల్తీ లడ్డు పాపాన్ని సాక్ష్యాలతో సహా బయట పెట్టాయి. వైసీపీ వారు చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆధునిక సాంకేతికత, ల్యాబ్ నివేది కల ముందు అబద్ధాలు నిలవ లేవు.. అపవిత్ర పాలనలో అపచారాలు ఎన్నో, వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే తిరుమల బోర్డు టీటీడీ నియామకాల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. ధార్మిక చింతన లేని వ్యక్తులకు పగ్గాలు అప్పగించడం వల్లనే ఈ రోజు ఇలాంటి దుస్థితి దాపురించింది. నెయ్యి కొనుగోలు ప్రక్రియలో నాణ్యత కంటే కమిషన్లకే ప్రాధాన్యత ఇచ్చారన్నది బహిరంగ రహస్యం. గత ప్రభుత్వం అనుసరించిన రివర్స్ టెండరింగ్ విధానం, తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేస్తామన్న కంపెనీలను ప్రోత్సహించడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసి కోట్లాది మంది హిందువుల మతాచారాలను భ్రష్టు పట్టించిన ఈ చర్యను కేవలం పొరపాటుగా చూడలేం, ఇది ఒక వ్యవస్థీకృత నేరం అని చెప్పాలి. ఈ మహా పాపానికి కారకులైన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించబడాలి. అప్పుడే భవిష్యత్తులో ఇలాంటి సాహసాలు ఎవరూ చేయలేరు.. నివేదికల రూపంలో బయటపడిన ఈ నిజాలు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావాలి.

# వైద్యరంగానికి బసవపట్నం కృషి

భారతదేశంలో ఆధునిక వైద్య విజ్ఞానం అభివృద్ధి చెందడంలో అనేక మంది వైద్యులు, పరిశోధకులు, విద్యావేత్తలు తమ జీవితాలను అంకితం చేశారు. ఆ మహనీయుల సరసన గౌరవంగా నిలిచే పేరు డాక్టర్ బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు. శస్త్రచికిత్స రంగంలో ఆయన చేసిన సేవలు భారత వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వైద్యుడిగా, ఉపాధ్యాయుడిగా, పరిశోధకుడిగా, రచయితగా ఆయన చూపిన ప్రతిభ, సమర్పణ, దూరదృష్టి భారత వైద్యరంగ అభివృద్ధికి కీలకంగా మారాయి. తన సుదీర్ఘ వైద్య జీవితంలో ఆయన శస్త్రచికిత్సలో అనేక కొత్త పద్ధతులను ప్రవేశపెట్టి, వైద్య విద్యకు కొత్త దిశానిర్దేశం చేశారు. వైద్య సేవలు సమాజానికి సేవ అనే భావనను ఆచరణలో చూపించిన మహనీయుల్లో బాలకృష్ణారావు ప్రముఖులు. బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు 1910 జనవరి 21న కర్ణాటక రాష్ట్రంలోని రామనగర జిల్లాలోని చన్నపట్న పట్టణంలో జన్మించారు. ఆయన కుటుంబంలో వైద్య సంప్రదాయం ఉండటం ఆయన జీవితాన్ని వైద్య రంగం వైపు మళ్లించింది. ఆయన తండ్రి డాక్టర్ బి.కె.నారాయణరావు ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు. బెంగళూరులోని మింటో కంటి ఆసుపత్రి స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారు. వైద్య సేవల పట్ల తండ్రికి ఉన్న నిబద్ధత చిన్ననాటి నుంచే బాలకృష్ణారావుపై ప్రభావం చూపింది. చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన ఆయనలో వైద్య విద్య పట్ల ఆసక్తి పెరిగింది. ప్రాథమిక మరియు మధ్య విద్యను మైసూరులో పూర్తి చేసిన బాలకృష్ణారావు తరువాత ముంబై విశ్వవిద్యాలయంలో వైద్య విద్యను అభ్యసించారు. అక్కడ వైద్యశాస్త్రంలో పట్టభద్రుడైన ఆయన మరింత ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లారు. ఆ కాలంలో విదేశీ విద్య ఎంతో కఠినమైనదిగా, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది. అయినప్పటికీ తన కృషి, పట్టుదలతో ఆయన ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధి గాంచిన శస్త్రచికిత్సా విద్యను అభ్యసించారు. 1936లో ఓఖీఆా పట్టా, 1937లో ఈఖీఆా పట్టాలను సంపాదించి శస్త్రచికిత్సలో నైపుణ్యం సాధించారు. ఈ విద్యాభ్యాసం ఆయనకు అంతర్జాతీయ స్థాయి వైద్య పరిజ్ఞానాన్ని అందించింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత ఆయన వైద్య సేవలను ప్రారంభించారు. 1940లో మైసూర్ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన వైద్య బోధనా జీవితాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు శస్త్రచికిత్సను బోధించే విషయంలో ఆయన ప్రత్యేకమైన పద్ధతులను అవలంబించారు. శస్త్రచికిత్స అనేది కేవలం సిద్ధాంత జ్ఞానం కాదు, అనుభవంతో కూడిన కళ అని ఆయన నమ్మకం. అందుకే వైద్య విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన బోధనా విధానం వల్ల అనేక మంది విద్యార్థులు నిపుణులైన శస్త్రవైద్యులుగా ఎదిగారు. 1945లో మైసూర్ మెడికల్ కాలేజీలోనే శస్త్రచికిత్స విభాగానికి ప్రొఫెసర్‌గా మరియు విభాగాధిపతిగా నియమితులయ్యారు. అక్కడ ఆయన వైద్య విద్యను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేశారు. శస్త్రచికిత్సా విభాగంలో ఆధునిక పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించారు. రోగుల చికిత్సలో నూతన విధానాలను ప్రవేశపెట్టారు. ఈ కాలంలో ఆయన వైద్య సేవలు మాత్రమే కాకుండా విద్యా రంగంలోనూ విశేష గుర్తింపు పొందారు. 1947లో గ్వాలియర్‌లోని గజర రాజా మెడికల్ కాలేజీలో చేరిన బాలకృష్ణారావు అక్కడ దాదాపు రెండు దశాబ్దాలపాటు సేవలందించారు. ప్రొఫెసర్‌గా, తరువాత డీన్‌గా పనిచేస్తూ వైద్య విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆ కాలంలో భారతదేశంలో వైద్య విద్య అభివృద్ధి దశలో ఉండేది. శిక్షణా సదుపాయాలు పరిమితంగా ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో బాలకృష్ణారావు తన దూరదృష్టితో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించే విధంగా పాఠ్యపద్ధతులను రూపొందించారు. ఆసుపత్రి సేవలు, వైద్య విద్య, పరిశోధనల మధ్య సమన్వయం సాధించడానికి ఆయన కృషి చేశారు. 1964లో ఆయన ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో శస్త్రచికిత్స విభాగానికి ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా నియమితులయ్యారు. దేశంలో అత్యున్నత వైద్య సంస్థగా గుర్తింపు పొందిన ఈ సంస్థలో ఆయన చేసిన సేవలు ఎంతో కీలకమైనవి. అక్కడ ఆయన శస్త్రచికిత్స విభాగాన్ని మరింత అభివృద్ధి చేశారు. శస్త్రచికిత్సలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చారు. వైద్య విద్యార్థులు, యువ వైద్యులు పరిశోధనలకు ఆసక్తి చూపేలా ప్రోత్సహించారు. ఆయన నాయకత్వంలో అనేక పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. శస్త్రచికిత్సలో ఆయన చేసిన పరిశోధనలు విశేష ప్రాధాన్యం పొందాయి. ముఖ్యంగా న్యూరోసైన్సెస్, మూత్రపిండ సంబంధిత వ్యాధులు, కాలేయ వ్యాధులపై ఆయన పరిశోధనలు చేశారు. శిశువుల్లో కనిపించే ప్రాథమిక కాలేయ క్యాన్సర్‌పై ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ వైద్య వర్గాలలో చర్చనీయాంశమయ్యాయి. "ప్రైమరీ కార్సినోమా ఆఫ్ లివర్ ఇన్ ఇన్ఫెన్సీ" అనే అంశంపై ఆయన చేసిన అధ్యయనం వైద్య ప్రపంచంలో గుర్తింపు పొందింది. వైద్య రంగంలో కొత్త చికిత్సా విధానాల అభివృద్ధికి ఆయన పరిశోధనలు తోడ్పడ్డాయి. డాక్టర్ బాలకృష్ణారావు ఒక గొప్ప రచయిత కూడా. శస్త్రచికిత్స, వైద్య విద్య, వైద్య విధానాలపై ఆయన అనేక శాస్త్రీయ వ్యాసాలు రాశారు. దేశ విదేశాల్లో వెలువడే వైద్య పత్రికల్లో ఆయన రచనలు ప్రచురితమయ్యాయి. శస్త్రచికిత్సలోని క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించడం ఆయన ప్రత్యేకత. వైద్య విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచే పాఠ్యగ్రంథాలను కూడా రచించారు. ఆయన రచనలు ఇప్పటికీ వైద్య రంగంలో ఉపయోగపడుతున్నాయి. వైద్య విద్యలో శిక్షణకు ఆయన అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. వైద్య విద్యార్థులు ప్రారంభ దశ నుంచే శస్త్రచికిత్సా పద్ధతులను నేర్చుకోవాలని ఆయన భావించేవారు. అందుకే యువ వైద్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రిలో ప్రత్యక్షంగా శస్త్రచికిత్సలను చూపిస్తూ విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం అందించారు. ఈ విధానం వల్ల ఆయన శిష్యుల్లో అనేక మంది తరువాత ప్రముఖ శస్త్రవైద్యులుగా ఎదిగారు. వైద్య రంగంలో సంస్థాగత అభివృద్ధికి కూడా బాలకృష్ణారావు కృషి చేశారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా అనే ప్రముఖ వైద్య సంఘానికి ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సంఘం ద్వారా దేశవ్యాప్తంగా శస్త్రచికిత్స వైద్యులకు శిక్షణా కార్యక్రమాలు, శాస్త్రీయ సమావేశాలు నిర్వహించబడ్డాయి. వైద్య పరిశోధనలను ప్రోత్సహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అనేక గౌరవాలు లభించాయి. 1945లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎన్నికయ్యారు. 1971లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసి సత్కరించింది. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు ఇది గొప్ప గుర్తింపుగా నిలిచింది. తరువాత కాలంలో అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆయనకు గౌరవాలు లభించాయి. ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ సభ్యత్వం పొందడం ఆయన ప్రతిభకు నిదర్శనం. 1972లో ఎఐఐఎంఎస్ నుండి పదవీ విరమణ చేసిన తరువాత కూడా ఆయన వైద్య సేవలను ఆపలేదు. 1975లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో సైంటిస్ట్ ఎమెరిటస్‌గా పనిచేశారు. తరువాత ఇండోర్‌లోని చోయిత్‌రామ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో సేవలందించారు. వృద్ధాప్యంలో కూడా ఆయన పరిశోధన, వైద్య సేవలను కొనసాగించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. తన జీవితాంతం వైద్య రంగ అభివృద్ధి కోసం కృషి చేసిన బాలకృష్ణారావు 1995 మార్చి 7న 85 సంవత్సరాల వయసులో పరమపదించారు. ఆయన మరణం భారత వైద్య రంగానికి తీరని లోటుగా భావించబడింది. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సంస్థ 2000 సంవత్సరంలో "డాక్టర్ బాలకృష్ణారావు ఒరేషన్" అనే వార్షిక ఉపన్యాసాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సంవత్సరం ప్రముఖ వైద్యులను సత్కరించడం జరుగుతోంది. డాక్టర్ బసవపట్నం నారాయణ బాలకృష్ణారావు జీవితం భారత వైద్యరంగానికి ఆదర్శంగా నిలిచింది. శస్త్రచికిత్సలో ఆయన చేసిన పరిశోధనలు, వైద్య విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి, వైద్య సేవల పట్ల ఆయన చూపిన నిబద్ధత సమాజానికి స్ఫూర్తిదాయకం. వైద్యుడు కేవలం రోగాలను నయం చేసే వ్యక్తి మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకుడిగా ఉండాలని ఆయన జీవితం చెబుతోంది. ఆయన వారసత్వం నేటి వైద్య ప్రపంచంలో కూడా ప్రేరణగా నిలుస్తోంది. భారతదేశంలో శస్త్రచికిత్స రంగ అభివృద్ధిలో ఆయన పాత్ర అమూల్యమైనది. వైద్య విద్యార్థులకు, యువ వైద్యులకు ఆయన జీవితం ఒక మార్గదర్శక దీపంలా నిలిచింది. సేవాభావం, పరిశోధనా దృక్పథం, విద్యా పరమైన కృషి ? ఈ మూడు లక్షణాల సమన్వయం డాక్టర్ బాలకృష్ణారావు వ్యక్తిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. భారత వైద్య రంగ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. శాస్త్రసాధనకు అంకితమైన ఆయన జీవితం భవిష్యత్ తరాల వైద్యులకు స్ఫూర్తి ప్రసాదిస్తూ చిరస్మరణీయంగా నిలిచిపోతుంది.

# దేశం గర్వించదగిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త?


భారతదేశంలో ఆధునిక ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనకు పునాది వేసిన ప్రముఖ శాస్త్రవేత్తలలో అప్పడవేదుల లక్ష్మీనారాయణ పేరు గౌరవప్రదంగా నిలుస్తుంది. శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ప్రతిభ, అంకితభావం కలిసిన అరుదైన వ్యక్తిత్వంగా ఆయన భారతీయ విజ్ఞాన చరిత్రలో చిరస్మరణీయుడయ్యారు. ముఖ్యంగా సౌర భౌతిక శాస్త్రం, నక్షత్రాల వర్ణపట విశ్లేషణ, ఖగోళ పరిశీలనా పరికరాల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చేసిన కృషి భారత ఖగోళ శాస్త్రానికి కొత్త దిశను నిర్దేశించింది. కొడైకెనాల్ సౌర పరిశోధనా కేంద్ర అభివృద్ధిలో ఆయన పోషించిన పాత్ర భారత ఖగోళ విజ్ఞాన చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలిచింది. అప్పడవేదుల లక్ష్మీనారాయణ 1887లో తూర్పుగోదావరి జిల్లాలోని అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు అప్పడవేదుల వ్యాసులు, మహాలక్ష్మి దంపతులు. చిన్ననాటి నుంచే విజ్ఞాన శాస్త్రాలపై అతీతమైన ఆసక్తి చూపిన లక్ష్మీనారాయణ, చదువులోనే కాకుండా పరిశోధనాత్మక ఆలోచనలో కూడా ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. గ్రామీణ వాతావరణంలో పెరిగినా, ప్రపంచ విజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలనే తపన ఆయనలో చిన్నప్పటినుంచే స్పష్టంగా కనిపించింది. ప్రాథమిక విద్యను కొత్తపేట ఉన్నత పాఠశాలలో పూర్తి చేసిన ఆయన, అనంతరం రాజమండ్రిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బి.ఎ. చదివారు. 1910లో ఆ విద్యను విజయవంతంగా పూర్తిచేసి, తరువాత భౌతిక శాస్త్రంపై మరింత లోతైన అధ్యయనం చేయాలనే సంకల్పంతో మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు. 1914లో భౌతిక శాస్త్రంలో ఎం.ఎ. పట్టా పొందారు. ఆ కాలంలో భారత దేశంలో శాస్త్ర పరిశోధనలకు తగిన వసతులు పరిమితంగా ఉన్నప్పటికీ, ఆయనలోని పరిశోధనాసక్తి తగ్గలేదు. తరువాత విజయనగరం మహారాజా కళాశాలలో ఉపన్యాసకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించారు. అదే సమయంలో ఆయనకు ఉన్నత శాస్త్రీయ పరిశోధన చేయాలనే సంకల్పం మరింత బలపడింది. ఈ సంకల్పమే ఆయనను ఇంగ్లండ్‌కు తీసుకెళ్లింది. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో డాక్టరేట్ పూర్తి చేసి ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనలో మరింత లోతుగా ప్రవేశించారు. ఆ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఖగోళ పరిశోధన వేగంగా అభివృద్ధి చెందుతోంది. నక్షత్రాల నిర్మాణం, సూర్యుని స్వభావం, అంతరిక్షంలోని మూలకాల స్వరూపం వంటి అంశాలు శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లక్ష్మీనారాయణ చేసిన పరిశోధనలు భారతదేశాన్ని అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర రంగంలో నిలబెట్టాయి. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఆయన కొడైకెనాల్‌లోని సౌర పరిశోధనా కేంద్రంలో సేవలు ప్రారంభించారు. తమిళనాడులోని కొడైకెనాల్ పర్వత ప్రాంతంలో ఉన్న ఈ పరిశోధనా కేంద్రం భారత ఖగోళ పరిశోధనలో ప్రముఖ స్థానం కలిగినది. ఇక్కడ పనిచేస్తూ ఆయన సూర్యుని నిర్మాణం, వాతావరణం, శక్తి ఉద్గారాలు, సౌర మచ్చలు వంటి అంశాలపై లోతైన పరిశోధనలు చేశారు. సూర్యుని వర్ణపట విశ్లేషణ ఆయన పరిశోధనల్లో అత్యంత ప్రాధాన్యం పొందిన అంశం. సూర్యుని నుండి వచ్చే కాంతిని ప్రత్యేక పరికరాల సహాయంతో విభజించి పరిశీలించడం ద్వారా సూర్యుని వాతావరణంలో ఉన్న మూలకాలను గుర్తించే విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ రంగంలో లక్ష్మీనారాయణ చేసిన పరిశోధనలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి. ఆయన సౌర వర్ణపటంలోని వివిధ స్పెక్ట్రల్ లైన్లను విశ్లేషించి సూర్యుని వాయుమండల నిర్మాణం గురించి విలువైన వివరాలను వెలికితీశారు. సూర్యుని ఉపరితలంపై కనిపించే సౌర మచ్చలు, సౌర జ్వాలలు, సౌర మబ్బులు వంటి పరిణామాలపై ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ శాస్త్రవేత్తల ప్రశంసలను అందుకున్నాయి. సూర్యుని ఉపరితల ఉష్ణోగ్రత మార్పులు, వాతావరణ స్థితిగతులు, కాంతి ఉద్గారాల స్వభావం వంటి అంశాలను ఆయన సూక్ష్మంగా పరిశీలించారు. ఈ పరిశోధనలు తరువాతి తరం ఖగోళ శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలిచాయి. సూర్యుని వర్ణపట విశ్లేషణ ద్వారా హైడ్రోజన్, హీలియం వంటి మూలకాల ఉనికి గురించి శాస్త్రీయ ఆధారాలను సమర్థంగా వివరించడంలో ఆయన పాత్ర విశేషమైనది. అంతేకాకుండా నక్షత్రాల వర్ణపటాలపై చేసిన పరిశోధనలు కూడా ఖగోళ భౌతిక శాస్త్ర అభివృద్ధికి మేలుచేశాయి. నక్షత్రాల ఉష్ణోగ్రత, రసాయనిక నిర్మాణం, పరిణామ ప్రక్రియలను అర్థం చేసుకోవడంలో ఆయన చేసిన పరిశోధనలు విశేషంగా ఉపయోగ పడ్డాయి. నక్షత్రాల వర్ణపటాలలో కనిపించే ప్రత్యేక రేఖలను విశ్లేషించి అవి ఏ మూలకాల ఉనికిని సూచిస్తాయో ఆయన అధ్యయనం చేశారు. ఈ పరిశోధనలు నక్షత్రాల నిర్మాణాన్ని అర్థం చేసుకోవడంలో శాస్త్రవేత్తలకు సహాయపడ్డాయి. అంతరిక్షంలోని నక్షత్ర సమూహాల పరిణామం గురించి శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో కూడా ఆయన కృషి ప్రముఖమైనది. ఖగోళ పరిశోధనకు అవసరమైన పరికరాల అభివృద్ధి విషయంలో కూడా లక్ష్మీనారాయణ విశేష కృషి చేశారు. పరిశీలనా పరికరాల నాణ్యత మెరుగు పడితేనే ఖచ్చితమైన పరిశోధనలు సాధ్యమవుతాయని ఆయన నమ్మకం. అందువల్ల కొడైకెనాల్ పరిశోధనా కేంద్రంలో ఉన్న సౌర స్పెక్ట్రోగ్రాఫ్ పరికరాలను ఆధునీకరించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ ఆధునీకరణ వల్ల సూర్యుని వర్ణపట పరిశోధనలు మరింత ఖచ్చితంగా నిర్వహించే అవకాశం లభించింది. భారత దేశంలో ఖగోళ పరిశోధనను సంస్థాగతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆయన నిరంతరం కృషి చేశారు. భారత ఖగోళ పరిశోధన అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన కలగన్నారు. ఈ దిశగా శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం, పరిశోధన వాతావరణాన్ని మెరుగుపరచడం వంటి పనుల్లో కూడా ఆయన ముఖ్య పాత్ర పోషించారు. ఆయన చేసిన విశేష సేవలకు గాను భారత ప్రభుత్వం 1957లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఇది భారతదేశంలో శాస్త్రవేత్తలకు లభించే అత్యున్నత గౌరవాలలో ఒకటి. ఆయన ప్రతిభకు గుర్తింపుగా భారత జాతీయ సైన్స్ అకాడమీ ఫెలోగా ఎంపికయ్యారు. అలాగే లండన్‌లోని భౌతికశాస్త్ర సంస్థ ఫెలోగా కూడా ఎన్నికయ్యారు. తిరువాన్కూరు మహారాజా వారు ప్రదానం చేసిన "కర్జన్ స్మారక బహుమతి" ఆయన శాస్త్రీయ ప్రతిభకు మరో గుర్తింపుగా నిలిచింది. భారత సైన్స్ కాంగ్రెసులో భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షుడిగా ఆయన సేవలందించారు. శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా విజ్ఞాన పరిపాలనలో కూడా ఆయన సమర్థత చూపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ సభ్యునిగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా తన ఆలోచనలను పంచుకున్నారు. అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర సమాజం కూడా ఆయన కృషిని గౌరవించింది. చంద్రుని ఉపరితలంపై ఉన్న ఒక బిలానికి "లక్ష్మీనారాయణ" అనే పేరు పెట్టడం ఆయనకు లభించిన అరుదైన గౌరవం. ఇది ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిలో ఎంత ప్రాధాన్యం పొందాయో తెలియజేస్తుంది. 1973 మార్చి 7న అప్పడవేదుల లక్ష్మీనారాయణ పరమపదించారు. అయితే ఆయన చేసిన పరిశోధనలు కాలాన్ని దాటి నేటికీ శాస్త్ర ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. భారతదేశంలో ఖగోళ భౌతిక శాస్త్ర అభివృద్ధికి ఆయన వేసిన పునాది తరువాతి తరాల శాస్త్రవేత్తలకు బలమైన ప్రేరణగా నిలిచింది. కొడైకెనాల్ సౌర పరిశోధనా కేంద్రం అభివృద్ధి చెందడంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తించదగినది. ఆయన కాలంలో ప్రారంభమైన పరిశోధనా సంప్రదాయం తరువాతి దశల్లో మరింత విస్తరించి భారతదేశాన్ని అంతర్జాతీయ ఖగోళ పరిశోధనలో ఒక ప్రముఖ కేంద్రంగా నిలబెట్టింది. భారతదేశంలో శాస్త్ర పరిశోధనకు స్వదేశీ ప్రతిభ ఎంత గొప్పదో అప్పడవేదుల లక్ష్మీనారాయణ జీవితం మనకు స్పష్టంగా తెలియజేస్తుంది. సాధారణ గ్రామంలో జన్మించి ప్రపంచ ఖగోళ శాస్త్ర వేదికపై భారతదేశాన్ని నిలబెట్టిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకం. విజ్ఞానంపై ఆసక్తి, పరిశోధనపై నిబద్ధత, దేశాభివృద్ధి పట్ల అంకితభావం కలిసినప్పుడు సాధారణ మనిషి కూడా అసాధారణ శిఖరాలను అధిరోహించగలడని ఆయన జీవిత గాథ చాటి చెబుతుంది. భారత ఖగోళ భౌతిక శాస్త్ర చరిత్రలో అప్పడవేదుల లక్ష్మీనారాయణ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. సూర్యుని రహస్యాలను అన్వేషించిన ఆ మహానుభావుడు భారత విజ్ఞాన సంపదకు అందించిన సేవలు శాశ్వతంగా నిలిచే ఆభరణాలు. శాస్త్రానికి ఆయన అంకితమైన జీవితం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తూ దేశం గర్వించదగిన వారసత్వంగా నిలిచిపోతుంది.



# పొద్దున్నే అరటి పండు తింటున్నారా?

అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో ఒకటి. అంతేకాదు.. అన్ని సీజన్లు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేది అరటి పండు. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ అరటి పండును ఇష్టంగా తింటారు. చాలా మంది ఉదయం అల్పాహారం ముందు లేదా ఖాళీ కడుపుతో అరటిపండు తినే అలవాటు పెట్టుకుంటారు. అరటి పండులో ఎన్నో పోషకాలు ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం ఇందులో సమృద్ధిగా ఉంటాయి. దీని వలన జీర్ణశక్తి పెరగడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే నిద్రలేవగానే అరటి పండు తినడం మంచిదేనా ? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియంతో పాటు అరటి పండులో నేచురల్ షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వలన బీపీ పెరిగి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో గుండె ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటంలో కూడా అరటిపండు ఉపయోగపడుతుంది. ఉదయాన్నే అరటిపండు తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది సహజమైన చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రుక్టోజ్, సుక్రోజ్) కలిగి ఉండటం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అరటిపండు ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ వల్ల కడుపు సక్రమంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది మంచి పరిష్కారంగా ఉంటుంది. ఉదయం అరటిపండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంది. మానసిక ఆరోగ్యానికి కూడా అరటిపండు ఉపయోగకరం. ఇందులో ట్రిప్టోఫాన్ అనే పదార్థం ఉండటంతో ఇది శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. అరటిపండులో పొటాషియం, ఫైబర్, విటమిన్ అ, విటమిన్ ః6 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే అరటి పండు తినడం వలన ఇన్‌స్టాంట్ ఎనర్జీ లభిస్తున్నప్పటికీ ఆరోగ్యనిపుణులు ఇది మంచిది కాదని తెలిపారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన యాసిడిటీ సమస్య రావచ్చని చెబుతున్నారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన తక్షణమే శక్తి లభిస్తుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం లెవల్స్ సమృద్ధిగా ఉంటాయి. అరటి పండులో తక్కువ కేలరీలు ఉన్నప్పటికీ, అధికంగా తినడం వలన శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే ఖాళీ కడుపుతో ఎక్కువగా అరటిపండ్లు తినడం మంచిది కాదని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ లేదా ఆమ్లత్వ సమస్యలు ఉన్నవారు పరిమితంగా తినడం మంచిది. మొత్తానికి ఉదయం ఒక అరటిపండు తినడం శరీరానికి శక్తి, జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే సమతుల ఆహారంతో పాటు తీసుకుంటే మరింత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

# నానబెట్టిన కిస్‌మిస్‌తో బెనిఫిట్స్?



నానబెట్టిన ఎండు ద్రాక్ష శక్తివంతమైన పోషకాల గని. వీటిని రాత్రి నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినడం వలన జీర్ణశక్తి, గుండె ఆరోగ్యం మెరుగుపడతాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది, శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని పెంచడంలో తోడ్పడతాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ చిన్న పండ్లను మీ దినచర్యలో భాగం చేసుకోండి. ద్రాక్షలు.. చూసేందుకు చాలా చిన్నసైజు పండ్లు.. కానీ, ఇది శక్తివంతమైన పోషకాలతో నిండినవి. ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారు. ఇందులో ఫైబర్, విటమిన్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వాటిని రాత్రి నీటిలో నానబెట్టి, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. నిపుణుల ప్రకారం, నానబెట్టిన ద్రాక్షలను తినడం వల్ల శరీరంలో డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి పెరుగుతుంది. నానబెట్టి కిస్‌మిస్ తినడం వలన జీర్ణశక్తి పెరుగుతుంది, గట్ హెల్త్ మెరుగవుతుంది. ఇందులో వాటర్ కంటెంట్, ఫైబర్ సమృద్ధిగా ఉండటం వలన మలబద్ధకం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నానబెట్టిన కిస్‌మిస్‌లో పొటాషియం,ఇతర సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. దీని వలన గుండె పనితీరు మెరుగవుతుంది. నానబెట్టిన ద్రాక్షల్లో యాంటీ ఆక్సిడెంట్స్, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రెషర్, కొలెస్ట్రాల్ లెవెల్స్ నియంత్రణలో సహాయపడతాయి. దీనివల్ల హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. నానబెట్టిన ద్రాక్షలు రుచి మాత్రమే కాకుండా ఫైబర్ కారణంగా కడుపును సక్రమంగా ఉంచి, పేగు సమస్యలు, కడుపు నిండినట్లు అనిపించడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్యను నివారించడంలో ఇది ఫలవంతంగా పని చేస్తుంది. నానబెట్టిన ఎండుద్రాక్షలో నేచురల్ షుగర్స్‌తో పాటు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వలన తక్షణ ఎనర్జీ లభిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన శరీరానికి సమృద్ధిగా లభిస్తాయి. స్కిన్ హెల్త్ మెరుగవుతుంది. నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ మితంగా తీసుకోవడం ఎంతో ముఖ్యం. నానబెట్టిన ద్రాక్షలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు ఉండటంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ప్రతిరోజు ఖాళీ కడుపుతో నానబెట్టిన ద్రాక్షలు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. ఉద్యోగ, చదువులు లేదా వ్యాయామంలో అలసట తక్కువగా ఉంటుంది. అదనంగా, ఇది బోన్లు, దంతాల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్రతి రోజు రాత్రి నానబెట్టి, ఉదయం 5?10 ద్రాక్షలు తినడం, శక్తివంతమైన, ఆరోగ్యకరమైన అలవాటు. ఇది శరీరానికి, చర్మానికి, హృదయానికి, జీర్ణక్రియకు, ఇమ్యూనిటీకి ఎంతో మేలు చేస్తుంది.

# విరుద్ధ ఆహారంతో చర్మ వ్యాధులు

పాలు సంపూర్ణ ఆహారం అని మనందరికీ తెలుసు. పెరిగే పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ పాలు ఎంతో బలాన్ని ఇస్తాయి. అయితే, పాలు ఎంత పోషక విలువలు కలిగినవో, అంతే సెన్సిటివ్ కూడా. ఆయుర్వేదం ప్రకారం పాలను కొన్ని రకాల ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అవి మన జీర్ణవ్యవస్థపై వినాశకర ప్రభావాన్ని చూపుతాయి. శరీరంలో టాక్సిన్స్ (విషతుల్యాలు) పేరుకుపోవడానికి కారణమవుతాయి. పాలు తాగేటప్పుడు మనం చేసే చిన్న చిన్న తప్పులు ఎలాంటి అనారోగ్యాలకు దారితీస్తాయో తెలుసుకుందాం. ఆమె రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పాలు, పండ్లను కలిపి తీసుకుంటుంది. అతను జిమ్ ముగించుకుని గుడ్లు, పాలు కలిపి సేవిస్తాడు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివని వారు నమ్ముతుంటారు. కానీ, కొన్ని రోజుల తర్వాత వారిద్దరికీ చర్మంపై దద్దుర్లు, కడుపులో ఉబ్బరం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఖరీదైన మందులు వాడినా ఫలితం లేదు. ఎందుకో తెలుసా? వారు తీసుకుంటున్న ఆహారంలోనే అసలు శత్రువు దాగి ఉన్నాడు. పాలు ఒక అమృతం లాంటిదే కావచ్చు, కానీ కొన్ని వస్తువులతో కలిస్తే అది విషంగా మారుతుంది.



1. **పాలు సిట్రస్ పండ్లు (నిమ్మ, నారింజ):** నిమ్మ, నారింజ, స్ట్రాబెర్రీ, పైనాపిల్ వంటి పండ్లు ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటాయి. పాలు చలవ చేసే గుణం కలిగి ఉండి జీర్ణం కావడానికి సమయం తీసుకుంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకున్నప్పుడు కడుపులో పాలు వెంటనే విరిగిపోతాయి. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ మరియు చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పాలు తాగిన గంట వరకు ఈ పండ్లను తీసుకోకపోవడమే మంచిది.
2. **చేపలు - పాలు:** మన పెద్దలు ఎప్పుడూ చెప్పే మాట.. చేపలు తిన్న తర్వాత పాలు తాగకూడదు. ఆయుర్వేదం ప్రకారం చేపలు వేడి చేసే గుణాన్ని, పాలు చలవ చేసే గుణాన్ని కలిగి ఉంటాయి. ఈ రెండు విరుద్ధ స్వభావాలు కలిగిన ఆహారాలను కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో అసమతుల్యత ఏర్పడి దీర్ఘకాలంలో చర్మ అలర్జీలు, బొల్లి వంటి సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.
3. **పాలు- పుల్లని పదార్థాలు** (ఊరగాయలు, వెనిగర్): ఊరగాయలు, వెనిగర్ తో చేసిన వంటకాలు లేదా పుల్లటి పెరుగుతో చేసిన పదార్థాలను పక్కన పెట్టుకుని పాలు తాగడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. వీటిలోని ఆమ్లాలు పాలను గడ్డకట్టేలా చేస్తాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థలో అసౌకర్యం కలగడమే కాకుండా, వికారం వచ్చే అవకాశం ఉంది.
4. **గుడ్లు- పాలు:** ప్రస్తుత డైట్ ప్లాన్లలో పాలు, గుడ్లు కలిపి తీసుకోవడం సాధారణమైపోయింది. కానీ సాంప్రదాయ విజ్ఞానం దీనిని అంగీకరించదు. పాలలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది, గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం పడుతుంది. ముఖ్యంగా ఉడకని లేదా పచ్చి గుడ్లను పాలతో కలిపి తీసుకుంటే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యం కోసం పాలు తాగడం మంచిదే, కానీ ఏది దేనితో కలపాలో తెలియకపోతే అది అనారోగ్యానికి దారితీస్తుంది. పైన పేర్కొన్న పదార్థాలకు, పాలకు మధ్య కనీసం గంట లేదా రెండు గంటల విరామం ఉండేలా చూసుకోండి. మీ జీర్ణక్రియను కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది.



# ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారా?

ఫ్యాటీ లివర్ ఇప్పుడు ఒక సాధారణ సమస్యగా మారింది. ఇది కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. కాలేయం సరిగ్గా పనిచేయకపోతే, మొత్తం ఆరోగ్యంపై నేరుగా ప్రభావం పడుతుంది. ఫ్యాటీ లివర్ కారణంగా కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది, శరీరంలో విషపదార్థాల (టాక్సిన్స్) స్థాయిలు పెరుగుతాయి. జీవక్రియలో అసమతుల్యత కలుగుతుంది. కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన, రెండవ అతిపెద్ద అవయవం. ఇది శరీరానికి 500 కంటే ఎక్కువ విధులను నిర్వహిస్తుంది. అందువల్ల, ఆరోగ్యకరమైన, చురుకైన కాలేయాన్ని ఉంచుకోవడం చాలా ముఖ్యం. కానీ, సరైన ఆహారం తీసుకోకపోవడం, అనారోగ్యకరమైన జీవనశైలి వలన కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం (ఫ్యాటీ లివర్) సాధారణం. దీని వల్ల కాలేయ సామర్థ్యం తగ్గి, శరీరంలోని అనేక అవయవాల పనితీరు ప్రభావితమవుతుంది. అంతేకాదు, కొన్ని పండ్లను ఆహారంలో చేర్చడం వల్ల కాలేయంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఉపకరిస్తున్న కొన్ని పండ్లు..నారింజ, నిమ్మకాయ, బత్తాయి, కమలాఫలం వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ అ పుష్కలంగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. కాలేయాన్ని విష పదార్థాల నుంచి రక్షిస్తాయి. విటమిన్ అ కాలేయ నిర్విషీకరణలో సహాయపడుతుంది. కొవ్వు పేరుకుపోవడానికి అడ్డుగట్టుతుంది.ఆపిల్స్ లో కరిగే ఫైబర్ (పెక్టిన్) ఎక్కువగా ఉంటుంది. ఇది కాలేయంలో కొవ్వు తగ్గించడంలో, నిర్విషీకరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. రోజూ ఒక ఆపిల్ తినడం కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.బొప్పాయిలో విటమిన్లు, ఎంజైములు పుష్కలంగా ఉంటాయి, ఇవి జీర్ణక్రియకు మద్దతు ఇస్తాయి. ఫ్యాటీ లివర్ ఉన్నవారికి బొప్పాయి తినడం వల్ల కాలేయంపై భారాన్ని తగ్గించడంలో, పనితీరు మెరుగుపరచడంలో సహాయపడుతుంది.కివిలో విటమిన్లు, ఖనిజాల మిశ్రమం ఉంటుంది. ఇది కాలేయ ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని ప్రోత్సహిస్తుంది. అలాగే, కాలేయంపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది. ముఖ్యమైన విషయం ఏంటంటే.. పండ్లను సక్రమంగా ఆహారంలో చేర్చడం, సమతుల్య ఆహారం, వ్యాయామం, తగిన నిద్ర, నీరు త్రాగడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నిరోధించవచ్చు. ఆరోగ్యకరమైన కాలేయాన్ని కొనసాగించవచ్చు.

# అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అణిచివేస్తాం

**ప్రకృతి సంపదల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.**

**వీపనగండ్ల తూముకుంట వాగు వద్ద 9 ట్రాక్టర్లు సీజ్ నిందితులపై కేసులు నమోదు**

**జిల్లాలో 3 రోజుల్లో 30 ఇసుక ట్రాక్టర్లపై కేసులు నమోదు.**




**వనపర్తి** : అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.వనపర్తి జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకం, రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష లేదు ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అణిచివేస్తామని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, , అన్నారు.వనపర్తి జిల్లా వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. తూముకుంట వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వీపనగండ్ల ఎస్సై, రాణి, పోలీసులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., తెలిపారు. గత మూడు రోజుల వ్యవధిలోనే జిల్లాలో 30 కేసులు నమోదు ఒక వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక 15 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ? ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకం లేదా రవాణాకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తిస్తే ట్రాక్టర్లు, వాహనాలను తక్షణమే స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇసుక అక్రమ రవాణాలో పాల్గొనే వారు వాహనాలు సీజ్ కావడం, కేసులు నమోదు కావడం వంటి తీవ్ర పరిణామాలు తప్పవని గుర్తుంచుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, ఎవరు చట్టాన్ని అతిక్రమించినా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.ప్రకృతి సంపదలను అక్రమంగా దోచుకోవడం వల్ల పర్యావరణ సమతుల్యతకు తీవ్ర భంగం కలుగుతుందని, భవిష్యత్ తరాలకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశముందని అందువల్ల ప్రజలు చట్టాలను గౌరవిస్తూ ఇసుక అక్రమ తవ్వకం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.జిల్లాలో ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, చట్ట అమలులో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రజల సహకారంతోనే అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టగలమని ఆమె పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులు

# ప్రత్యేక దృష్టి సారించాలి



**వనపర్తి** : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం లో పాల్గొని.పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశాలలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహం.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మహబూబ్నగర్ శాసనసభ్యులు ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి .వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ .మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓుబేదుల్ల కోత్వాల్ .రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి.ఐదు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.అటవీ శాఖకు సంబంధించిన చిన్న సమస్యల పైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అవి ఏళ్ల తరబడిగా అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆయన మంత్రిగారు దృష్టికి తీసుకువచ్చారు.జిల్లా హాస్పిటల్స్ లో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే వారిని హైదరాబాద్ సిఫారసు చేస్తున్నారని ఆస్పత్రులలో కావలసిన అన్ని సదుపాయాల ఏర్పాటు కోసం మంత్రిగారి దృష్టి సారించారని ఆయన కోరారు.సమృద్ధిగా యూరియా ఉన్న చిన్న చిన్న సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆన్లైన్ బుకింగ్ లాంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బేస్మెట్ లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో పూర్తిస్థాయి అవగాహన లేదని లబ్ధిదారులకు అందుకు సంబంధించిన అవగాహన కల్పించేలా చూడాలని ఆయన సూచించారు.వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో ఒకలాగా మరికొన్ని ప్రాంతాల్లో ఇంకోలా ఉందని అలాంటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు.ప్రజా రవాణాలకు సంబంధించి ఆటోలలో ఇతరత్రా రవాణా వాహనాలలో ఎక్కువమందిని కూర్చోబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఖీూ అధికారులు దృష్టి సారించి ప్రమాదాల నివారణ పై చర్యలు తీసుకోవాలన్నారు.ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

# మహిళా సంఘాలతో ముఖాముఖి

## పాల్గొన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్** : హైదరాబాద్ జిల్లా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మసాబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్క్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ – వ్యర్థాల సేకరణ సెంటర్ ను ప్రారంభించారు. హైదరాబాద్ లో మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన అద్దాల లైబ్రరీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. మహిళా సంఘాలకు 35 కోట్ల రూపాయలు సున్నా వడ్డీ రుణాలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్ ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. మహిళా సంఘాలతో ముఖాముఖి సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం 99 రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామాలు వార్డుల నుండి రాజధాని వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. చాచా నెహ్రూ పార్క్ లో ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రారంభించుకున్నాం. 12 వేల గ్రామాల్లో,వార్డుల్లో ,మున్సిపాలిటీ లలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇక్కడ ఈరోజు ఈ వ్యర్థాల సేకరణ సెంటర్ ప్రారంభించాం. మన ఇళ్లలో ఉండే పాత టీవీ లు ,పాత ఫ్రిడ్జిలు , కంప్యూటర్ ,ల్యాప్ టాప్ లు పాడైపోయిన వాటిని అక్కడే ఉంచడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు.. దానిని ఈ వ్యర్థాల సేకరణ సెంటర్ కి తెచ్చి రీసైక్లింగ్ చేయాలని అన్నారు. ఇక్కడ 1500 చదరపు గజాల స్థలంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించుకున్నాం.. ఇది స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.. పుస్తకాలు డొనేట్ చేయడానికి ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశాం. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించుకున్నాం. పట్టణంలో మహిళా సంఘాల సభ్యుల సంఖ్య తక్కువ ఉంది.. ప్రతి మహిళా మహిళా సంఘంలో చేరాలి. మహిళలకు ఉచిత బస్సుతో పాటు అనేక కార్యక్రమాలు చేపట్టింది.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం,రేషన్ కార్డులు మహిళల పేరు మీద ఇస్తున్నాం. ఐకేపీ,మహిళా సంఘాల తరుపున బస్సులు ఆర్టీసీ లో నడుస్తున్నాయి.. బస్సులకు మహిళలను యజమానులను చేయడం జరిగింది. మహిళా సంఘాల్లో మహిళలు చేరాలి.. ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీ రుణాలు పొంది ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి. సెట్విన్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం..కుట్టు మిషన్లు అందిస్తున్నాం. మీ కాళ్ళ మీద మీరు నిలబడాలి. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో మహిళలు చురుకుగా ఉండాలి. విద్యా ,వైద్యం ,పర్యావరణం , భద్రత ఇలా అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలి. మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు.

### డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ వేగవంతం

### ఏసీఐ ఇన్ఫోటెక్ లక్ష్యం

**హైదరాబాద్** : ఏసీఐ ఇన్ఫోటెక్ ఒక ప్రముఖ గ్లోబల్ ఐటీ కన్సల్టింగ్ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ డిజిటల్ యుగంలో సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ఆధునీకరించడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి మార్పులను స్వీకరించడానికి సహాయపడుతుందని జగన్నాథ్ వర్మ కనుమూరి అధ్యక్షుడు డ అఙూ ంఅఎ ఇన్ఫోటెక్ హైదరాబాద్ ఒక్క హోటల్ లో నిర్వహించిన కార్యక్రమంలో తెలిపారు. ఈ సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ ఎంటర్ప్రైజ్ అప్లికేషన్స్ రంగాలలో ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉందని తెలిపారు. వివిధ పరిశ్రమలలోని సంస్థలతో భాగస్వామ్యం చేస్తూ, వారి సామర్థ్యాన్ని పెంచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ను వేగవంతం చేయడం లక్ష్యంగా పనిచేస్తుందని వెల్లడించారు. కస్టమర్ సెంట్రిక్ దృక్పథంతో, ఏసీఐ ఇన్ఫోటెక్ సంస్థలు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండే స్కేలబుల్, సురక్షితమైన ఆధునిక టెక్నాలజీ సేవలను అందిస్తుందని వివరించారు. అధునాతన డిజిటల్ సామర్థ్యాలను వ్యూహాత్మక కన్సల్టింగ్తో కలిపి ఏసీఐ ఇన్ఫోటెక్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలకు వారి వ్యాపారాలను మెరుగుపరచడం, పనితీరును పెంచడం దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించడంలో తోడ్పడును అందిస్తుందని తెలిపారు.

### రేవంత్‌కు కులతత్వం ఎక్కువ

### మంద కృష్ణ మాదిగ

**హైదరాబాద్** : సీఎం కు కృతజ్ఞత భావం కంటే కులతత్వం ఎక్కువ అని నిరూపించుకుంటున్నారు. మొసలి కన్నీరి ఆపి నిజాయితీగా ఉండక పోతే మాదిగలు రేవంత్ పాలనకు అడ్డుకట్ట వేస్తారని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం అయన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మీడియాతో మాట్లాడారు. ఎన్నడులేని విధంగా మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగింది రేవంత్ పాలనలోనే. 11 % రెసర్వేషన్ ఇవ్వాల్సి ఉండగా 9% మాత్రమే ఇచ్చారు. దీంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగింది. గత నోటిఫికేషన్ లకు కూడా రెసర్వేషన్ అమలు చేస్తామని చెప్పి మోసం చేసారు. దీంతో వేలాది ఉద్యగాలు నష్టపోయామ్. లోక్సభలో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేసిన ఘనత రేవంత్ రెడ్డి దే. రాజ్యసభలో కూడా అవకాశాలను అడ్డుకున్నది రేవంత్ రెడ్డి నే. ?? మొదటినుంచి రేవంత్ కు సన్నిహితంగా ఉన్న సాంబయ్యను కాదని సకల సౌకర్యాలు అందుకుంటూ సీఎంతో సమానంగా అధికారాన్ని చలాయిస్తున్న వేము నరేందర్ రెడ్డి కి అవకాశం ఇచ్చారు. గతంలోనూ సాంబయ్యకు అన్యాయం చేసింది రేవంత్ రెడ్డినే. బి ఆర్ ఎస్ బీఫామ్ తీసుకున్న కడియం శ్రీహరి కుమార్తెకు కాంగ్రెస్ నుంచి బీఫామ్ ఇప్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. ఇప్పటికేనా మారి భవిష్యత్ లో మాదిగలకు అవకాశం ఇవ్వండి లేక పోతే మీకు అధికారాన్ని ఇచ్చినా వారే మీకు దాన్ని దూరం చేస్తారు అని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి సన్మాన సభ చేసేవారు మాదిగ సామాజిక వర్గానికి రెండేళ్లుగా చేస్తున్న అన్యాయాలను సమర్థిస్తూ చేస్తున్నారా అనే అనుమానం కలుగుతుందని అన్నారు. మాదిగల వల్లే అధికారాన్ని పొందగలిగామని చెబుతున్న రేవంత్ మాదిగలను అనగా తొక్కుతున్నారా అంటూ ప్రశ్నించారు. తీరు మార్చుకోకపోతే అధికారాన్ని ఇచ్చిన వారే దాన్ని దూరం చేసి చూపిస్తారన్న విషయాన్ని మరవద్దని అన్నారు.

### ప్రజా పాలన కార్యక్రమంలో

### ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**నల్గొండ** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక 99 రోజుల సన్నాహక సమావేశం నల్లగొండ జిల్లా నకిరేకల్ లో ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులతో కలిసి నిర్వహించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఏమి అవసరం ఉందో తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.గంజాయి నిర్మూలన కోసం పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు..

### మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్** : బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హోటల్ కత్రియాలో రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ఎంపీ బన్సూరి స్వరాజ్ ముఖ్య అతిథిగా హాజరైయారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విశిష్ట అతిథిగా హాజరైయారు. వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

### మహిళా డాక్టర్ హిట్ అండ్ రన్

**హైదరాబాద్** : గాంధీ నగర లో మహిళా కారుతో హిట్ అండ్ రన్ చేసింది. జీరా, భరత్ పెట్రోల్ పంపు వద్ద స్కూటీ నీ ఢీకొట్టి పరారైయింది. వేగంగా డ్రైవ్ చేసి స్కూటీ కి డికొట్టిన దృశ్యాలు సీసీటీవీ లో రికార్డ్ అయ్యాయి. బాధితుడు బీరం కృష్ణ తీవ్ర గాయాలతో అసుపత్రి లో చికిత్సపొందుతున్నాడు. కవాడిగూడ నుండి రాణిగంజి వైపు వెళ్తుండగా గత నెల 2న కారు ఢీకొంది. గాంధీ నగర్ పోలీసులు సీసీ టీవీ ఫూటేజీ ఆధారంగా కారు నెంబర్ ట్రేస్ చేసారు. కారు నెంబర్ టీఎస్ 08 హెచ్ఎల్ 4682 నిలోఫర్ డాక్టర్ బెక్కం విజయ నిర్మల పేరు పై రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయకుండా 125(జీ) నిర్లక్ష డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి మహిళా డాక్టర్ ను అరెస్ట్ చేసి కారు సీజ్ చేయాలని కృష్ణ కుటుంబ సభ్యులు కోరుతున్నారు

### ఫీజు బకాయిలు చెల్లించాలని

### బీసీ సంఘాల నిరసన

**హైదరాబాద్** : బీసీలకు మంత్రివర్గంలో అన్యాయం జరిగిందని , కనీసం రాజ్యసభలో బీసీలకు చోటు కల్పించపోవడం దురదృష్టకరమని ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ లక్డికాపుల్ లోని హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. పేద కులాలు ఉన్నత చదువులు చదవడం సీఎం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్లలకు వేల కోట్లు బిల్లు చేస్తున్నారని కానీ.. రీయింబర్స్మెంట్ విడుదల చెయ్యడానికి మీనా మేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమానికి విద్యార్థి లోకం సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

### ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం

### పాల్గొన్న మంత్రులు పొంగులేటి, వాకిటి

**ఖమ్మం** : ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన 99 రోజుల ప్రజపాలన విజయవంతం చేయాలని కోరారు. ప్రజాపాలనతో పాటు ప్రగతి ప్రణాళిక సైతం అధికారులు రరూపొందించాలని ఆదేశాలు ఇచ్చారు. 99 రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా పని చేయాలి. అందరికి అర్ధమయ్యేలా ప్రణాళిక రూపందించుకోవాలి. ప్రతీ పేదవాడికి అన్నీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన యొక్క ముఖ్య ఉద్దేశం అందరికి తెలియపరచాలి. అధికారులు ఎక్కడా అలసత్వం చేయకుండా పనిచేయాలి. ప్రతీ ఇంటికి అన్నీ పథకాలు తెలిసేలా, చేరేలా చేరేవిధంగా పని చేయాలి. ప్రతీ పేద వాడికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయా లేదా అనేది పరిశీలించాలి. పార్టీలకి అతీతంగా అర్హులైన పేదలకి అందేవిధంగా చూడాలని అన్నారు.

## బిజినెస్

### వేసవి కాలంలో గుడ్ల ధరల తగ్గుదల



కోడిగుడ్డు ధరలు భారీగా తగ్గాయి. సాధారణంగా వేసవి కాలంలో గుడ్ల ధరలు తగ్గుతుంటాయి. కానీ ఈసారి ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా ఒక్కసారిగా దారుణంగా పతనమయ్యాయి. పరస్పర దాడులతో పశ్చిమాసియా రగులుతోంది. ఆరు రోజులుగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా దేశాలు పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. దీనితో ఎక్కడికక్కడ ఎగుమతులు నిలిచిపోవడం కూడా గుడ్ల ధరలు పడిపోవడానికి కారణం.ఎగుమతులు నిలిచిపోవడంతో పౌల్ట్రీ పరిశ్రమకు భారీ మొత్తంలో నష్టం చేకూరుతుంది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు మూసివేయడం పౌల్ట్రీ పరిశ్రమపై భారీ ప్రభావం పడుతోంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ధర రూ.4.20కి పడిపోయింది. ఎగుమతులు నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో గుడ్డు ధర రూ.3.30కి కూడా పడిపోయింది.

### బేర్ గుప్పిట్లో దలాల్ స్ట్రీట్



ఇరాన్ యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలోనే ఇన్వెస్టర్లు ఏకంగా రూ. 21.29 లక్షల కోట్ల సంపదను కోల్పోవడం మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసుపై ప్రభావం చూపుతాయన్న భయంతో మదుపర్లు తమ షేర్లను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. గత శనివారం యుద్ధం మొదలైనప్పటికీ, మధ్యలో ఆదివారం మరియు మంగళవారం హోలీ పండగ సందర్భంగా మార్కెట్లకు సెలవులు రావడం ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. ఒకవేళ ఆ రోజుల్లో కూడా ట్రేడింగ్ జరిగి ఉంటే నష్టాల తీవ్రత ఇంకా భయంకరంగా ఉండేదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరామం లభించినప్పటికీ, అంతర్జాతీయ పరిణామాలు అనుకూలంగా లేకపోవడంతో మార్కెట్ సెంటిమెంట్ పూర్తిగా దెబ్బతింది. యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసేలా కనిపించకపోవడం, ఎగుమతులు మరియు దిగుమతులపై ఆంక్షలు కఠినతరం కావడం మరో ప్రధాన ఆందోళనగా మారింది. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం భయాలు పెరిగిపోయాయి. ఈ అనిశ్చితి వల్ల విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు, ఇది దేశీయ మార్కెట్లపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే, రాబోయే సెషన్లలో కూడా 'బేర్' హవా కొనసాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొనుగోలుదారులు వెనకడుగు వేస్తుండటంతో సూచీలు మరింత దిగువకు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచి తూచి అడుగులు వేయాలని, మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూడటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# క్రెడిట్ స్కోర్ లేకుంటే.. బ్యాంకులు హోమ్ లోన్ ఇస్తాయా



సొంతింటి కల నెరవేర్చుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. అయితే, ప్రస్తుత రోజుల్లో ఇల్లు నిర్మించాలన్నా, కట్టిన ఇల్లు కొనుగోలు చేయాలన్నా లక్షల నుంచి కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.దీంతో తప్పనిసరిగా బ్యాంకులో లోన్ తీసుకోవాల్సి వస్తోంది. అయితే, బ్యాంకుకు వెళ్లినప్పుడు చాలా మందికి ఎదురయ్యే సమస్య క్రెడిట్ స్కోర్. అసలు గంతలో ఎప్పుడూ లోన్ తీసుకోని వారికి క్రెడిట్ స్కోర్ అనేది ఉండదు. మరి అటువంటి వారికి బ్యాంకులు లోన్ ఇవ్వవా? కేవలం సిబిల్ స్కోర్ లేదన్న కారణంతో అప్లికేషన్ తిరస్కరించవచ్చా? దీనిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఏం చెబుతున్నాయి? అనే వివరాలు తెలుసుకుందాం. చాలా మంది క్రెడిట్ స్కోర్ లేకపోతే బ్యాంకులో లోన్ రాదని భావిస్తుంటారు. అయితే, ఇది ముమ్మాటికీ అపోహే. వాస్తవానికి మొదటి సారి లోన్ తీసుకునే వారిని న్యూ టూ క్రెడిట్ (ఔఆ) కేటగిరీగా పరిగణిస్తారు. వీరు క్రెడిట్ రిపోర్టులో స్కోర్ సున్నా లేదా మైనస్ వన్ అని కనిపిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఏ బ్యాంకు కూడా కేవలం క్రెడిట్ హిస్టరీ లేదన్న కారణంతో లోన్ అప్లికేషన్ తిరస్కరించకూడదు. 2025-26 నాటి తాజా బ్యాంకింగ్ రూల్స్ ప్రకారం మొదటిసారి లోన్ కావాలని కోరేవారికి ఫైనాన్స్ ఇన్‌క్లూషన్‌లో భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం, ఆర్‌బీఐ బ్యాంకులకు సూచించాయి. క్రెడిట్ స్కోర్ లేని సమయంలో బ్యాంకులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మీ ఆర్థిక స్తోమతను అంచనా వేస్తాయి. రుణ గ్రహీత నెలవారీ శాలరీ స్లిప్పులు, బ్యాంక్ స్టేట్ మెంట్స్, కనీసం రెండేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు పరిగణనలోకి తీసుకుంటాయి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం లేదా వ్యాపారంలో ఎంత కాలం నుంచి ఉన్నారు, కంపెనీకి ఉన్న గుర్తింపు ఏమిటి, అనేవి లెక్కలోకి తీసుకుంటారు. 2026 నాటి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.30 లక్షల లోపు హోమ్ లోన్లకు ఆస్తి విలువలో 90 శాతం వరకు లోన్ పొందే అవకాశం ఉంటుంది. ఆస్తి పత్రాలు క్లియర్ గా ఉంటే బ్యాంకులు ఈజీగానే లోన్ ఇస్తాయి. హోమ్ లోన్ ఈజీగా రావాలంటే కో అప్లికెంట్ సమర్థవంతంగా పని చేస్తుంది. మీ భార్య లేదా తల్లిదండ్రుల్లో ఎవరికైనా మంచి క్రెడిట్ స్కోర్ ఉంటే వారిని కో అప్లికెంట్ గా చేర్చుకోవడం ద్వారా లోన్ త్వరగా వస్తుంది. మరోవైపు కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు క్రెడిట్ స్కోర్ లేని వారికి ప్రత్యేక పథకాల కింద రుణాలు ఇస్తాయి. అయితే వీటిల్లో వడ్డీ రేట్లు బ్యాంకుల కంటే ఎక్కువగా ఉంటాయి. అలాగే మీరు కొనే ఇంటి ధరలో ఎక్కువ శాతం అంటే దాదాపు 30 శాతం వరకు మీరు డౌన్ పేమెంట్ చెల్లిస్తే బ్యాంకులు రిస్క్ తక్కువగా భావించి మిగితా డబ్బులను లోన్ గా ఇస్తాయి.

# ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు




మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల మధ్య ఇంధన భద్రతకు సంబంధించి ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో తగినంత ముడి చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయి. దేశంలో ఇంధన కొరత విషయంలో ఆందోళనలకు తెర దించుతూ పెట్రోల్, డీజిల్ గురించి ఎలాంటి నిబంధనలు విధించడంలేదని, దేశంలో కావాల్సిన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు కాబట్టి, ప్రజలు, పరిశ్రమలకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రత గురించి ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నాం, నిల్వలు రోజూ భర్తీ అవుతున్నాయి. ప్రధానంగా ఎల్‌పీజీ, ఎల్‌ఎన్‌జీ, ముడి చమురు సరఫరాకు ఎలాంటి సమస్యా లేదు. ప్రాధాన్యతా రంగాలకు గ్యాస్ సరఫరా నిరంతరం అందించడానికి గెయిల్ అవసరమైతే ఫోర్స్ మెజ్యూర్ ప్రకటించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ నిబంధన కింద అనూహ్య పరిస్థితులు ఎదురైతే ఒప్పందాన్ని పాజ్ చేయవచ్చు. భారత్‌కు పంపించాల్సిన ఎల్‌ఎన్‌జీ విషయంలో ఖతార్ ఇదే విధానాన్ని అమలు చేసింది. ప్రస్తుతం మనకు ఖతార్ రోజుకు 60 మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లు(ఎంఎస్‌సీఎండీ) గ్యాస్‌ను సరఫరా చేస్తోంది. అలాగే, ప్రపంచ అవసరాల్లో 20 శాతం మేర సరఫరా చేస్తోంది. అయితే, భారత్‌కు మొత్తం 195 ఎంఎస్‌సీఎండీ) దిగుమతులు అవసరం. కాబట్టి, మనదేశానికి కావాల్సిన గ్యాస్ కోసం ఇతర మార్కెట్లనూ అన్వేషిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల మధ్య భారత్ ప్రత్యామ్నాయ వనరులపైనా దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కెనడా, ఆస్ట్రేలియాలు గ్యాస్ సరఫరాకు అంగీకరించాయి. కొత్తగా జరిగిన ఒప్పందాల కింద యూఏఈ, అమెరికా నుంచి కూడా సమీకరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ ఒక దేశంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి లేదు. అంతర్జాతీయంగా ఇబ్బందులు తలెత్తకుండా పలు కంపెనీలతో చర్చలు జరుగుతున్నాయి. యుద్ధం కారణంగా పెరుగుతున్న నౌకల బీమా సౌకర్యాలపైనా అమెరికాతో చర్చలు జరుపుతున్నాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నౌకలకు తక్కువ ధరకు బీమా కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

# ఆస్ట్రేలియాతో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా ఆలౌట్



ఆస్ట్రేలియాతో ఏకైక టెస్టులో భారత మహిళా జట్టు మొదటి రోజు తడబడింది. తొలి ఇన్నింగ్స్‌లో నామమాత్రపు స్కోరుకే ఆలౌట్ అయింది. ఆసీస్ వుమెన్ టీమ్‌తో మూడు టీ20, మూడు వన్డేలు.. ఒక టెస్టు ఆడేందుకు హర్మన్ సేన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే.

**టాస్ గెలిచిన ఆస్ట్రేలియా**

టీ20 సిరీస్‌ను భారత్ 2–1తో దక్కించుకోగా.. వన్డే సిరీస్‌ను ఆసీస్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య శుక్రవారం డే- నైట్ టెస్టు మ్యాచ్ మొదలైంది. పెర్త్‌లోని ఔూజాూ స్టేడియం వేదికగా టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఫలితంగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే దెబ్బ తగిలింది. ఓపెనర్ స్మృతి మంధాన నాలుగు పరుగులకే వెనుదిరిగింది. లూసీ హామిల్టన్ బౌలింగ్‌లో బౌల్డ్ అయి పెవిలియన్ చేరింది. వన్‌డౌన్‌లో వచ్చిన ప్రతికా రావల్ (18) సైతం నిరాశపరిచింది.

**హాఫ్ సెంచరీతో రాణించిన జెమీమా**

ఇక మరో ఓపెనర్ షఫాలీ వర్మ 35 పరుగులతో ఫర్వాలేదనిపించగా.. నాలుగో నంబర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ అర్ధ శతకం (84 బంతుల్లో 52, 7 ఫోర్లు)తో రాణించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (19) విఫలం కాగా.. లోయర్ ఆర్డర్‌లో కశ్వీ గౌతం (34 నాటౌట్) మెరుగైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. మిగిలిన వారంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీప్తి శర్మ (7), రిచా ఘోష్ (11), స్నేహ్ రాణా (5), సయాలీ సత్‌గరే (7), క్రాంతి గాడ్ (1) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఫలితంగా భారత్ 62.4 ఓవర్లలో 198 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

**అనాబెల్‌కు నాలుగు వికెట్లు**

ఆసీస్ బౌలర్లలో అనాబెల్ సదర్లాండ్ నాలుగు వికెట్లతో చెలరేగి భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేయగా.. లూసీ హామిల్టన్ మూడు వికెట్లు పడగొట్టింది. డార్సీ బ్రౌన్ రెండు, ఆష్లే గార్డ్‌నర్ ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక తొలి రోజే బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆసీస్‌కు భారత బౌలర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. ఓపెనర్లలో జార్జియా వోల్ (2)ను సయాలీ బౌల్డ్ చేయగా.. ఫోబే లిచిఫీల్డ్ (9)ను క్రాంతి గాడ్ పెవిలియన్‌కు పంపింది. కెప్టెన్ అలెసా హీలీ (13) వికెట్‌ను సయాలీ తన ఖాతాలో వేసుకోగా.. ఎలిస్ పెర్రీ, అనాబెల్ పట్టుదలగా నిలబడ్డారు.

**నిలకడగా పెర్రీ, అనాబెల్**

శుక్రవారం నాటి మొదటిరోజు ఆట పూర్తయ్యేసరికి ఎలిస్ పెర్రీ 62 బంతుల్లో 43, అనాబెల్ 29 బంతుల్లో 20 పరుగులతో క్రీజులో నిలిచారు. మొత్తంగా ఆసీస్ 27 ఓవర్ల ఆట పూర్తి చేసుకుని మూడు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కంటే ఆసీస్ 102 పరుగులు వెనుకబడి ఉంది. అయితే, ఓవరాల్‌గా తొలి రోజు ఆసీస్‌దే పైచేయి అని చెప్పవచ్చు.

### తలతిక్క బ్యాటింగ్.. నీకంత దూకుడు ఎందుకు?




అభిషేక్ శర్మ.. తొలిసారి ప్రపంచకప్ టోర్నీ ఆడుతున్న ఈ ఓపెనింగ్ బ్యాటర్ దారుణంగా విఫలమవుతున్నాడు. ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌లలో అతడు చేసిన స్కోర్లు వరుసగా.. 0 (1), 0 (4), 0 (3), 15 (12), 55 (30), 10 (11), 9 (7). లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు ఆడి డకౌట్ అయినా యాజమాన్యం అభిషేక్ శర్మ ను ఓపెనర్‌గా కొనసాగించిది. అయితే, అతడి ఆట తీరు మాత్రం మారలేదు. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో కీలక సెమీ ఫైనల్లోనూ ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ తేలిపోయాడు. తొందరపడి వికెట్ పారేసుకుని తొమ్మిది పరుగులకే నిష్క్రమించాడు.

**సంజూ మెరుపు ఇన్నింగ్స్**

మరో ఓపెనర్ సంజూ శాంసన్ మెరుపు ఇన్నింగ్స్ (42 బంతుల్లో 89) తో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ ఆట తీరుపై విమర్శల వర్షం కురుస్తోంది. టీమిండియా దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సైతం ఈ ఓపెనింగ్ బ్యాటర్ వైఖరిని తప్పుబట్టాడు. "ఇంగ్లండ్‌తో సెమీ ఫైనల్లో అతడు తలతిక్కగా బ్యాటింగ్ చేశాడు. నిజానికి అభిషేక్ గేమ్‌ప్లాన్‌కు నేను వీరాభిమానిని. విల్ జాక్స్ బౌలింగ్‌లో అతడు ఎనిమిది పరుగులు రాబట్టాడు. కానీ ఈ తర్వాత అతడి ఓవర్లోనే 30 పరుగులు తీయాలి అన్నట్లు తొందరపడ్డాడు. కొన్నిసార్లు బాల్‌ను వదిలేయాల్సి ఉంటుంది. ఓవైపు సంజూ శాంసన్ కుదురుగా ఆడుతున్నాడు కదా!.. నీకు కష్టంగా అనిపిస్తే ఒక సింగిల్ తీసి మరో ఎండ్‌కు వెళ్లిపోవాల్సింది. ఆ తర్వాత మళ్లీ అవకాశం వస్తుంది కదా!.. ఏదేమైనా అంత దూకుడు పనికిరాదు" అని అశ్విన్ అభిషేక్‌పై మండిపడ్డాడు.

## స్పోర్ట్స్

### ఐసీసీ ప్రకటన.. ఆందోళనలో ఫ్యాన్స్!




టీ20 ప్రపంచకప్–2026 టోర్నమెంట్ తుది అంకానికి చేరుకుంది. తొలి సెమీ ఫైనల్లో సౌతాఫ్రికాను న్యూజిలాండ్.. రెండో సెమీస్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను భారత్ ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. ఈ క్రమంలో భారత్– న్యూజిలాండ్ మధ్య మార్చి 8 (ఆదివారం) ఫైనల్ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. ఇందుకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదిక. ఇక ఈ మెగా ఫైనల్‌కు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా కీలక ప్రకటన విడుదల చేసింది.

**అంపైర్లు వీరే..**

టీమిండియా– కివీస్ మధ్య టైటిల్ పోరుకు అంపైర్లను శుక్రవారం ప్రకటించింది. ఫీల్డ్ అంపైర్లుగా రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్‌లకు చోటు ఇచ్చినట్లు తెలిపింది. వీరిద్దరు ఇటీవల సౌతాఫ్రికా– న్యూజిలాండ్ సెమీ ఫైనల్‌కు కూడా అంపైర్లుగా వ్యవహరించారు.

**ఆ రెండుసార్లూ గెలిచినా..**

ఇదిలా ఉంటే.. ఐసీసీ టోర్నీల్లో ఇప్పటికే ప్రతిష్టాత్మక ఫైనల్‌లలో అంపైర్‌గా పని చేసిన అనుభవం ఇల్లింగ్‌వర్త్‌కు ఉంది. వన్డే వరల్డ్‌కప్–2023, టీ20 ప్రపంచకప్–2024, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ–2025 ఫైనల్స్‌లో ఆయనే అంపైర్. అయితే, 2023లో తప్ప 2024, 2025 టైటిల్ పోరులో టీమిండియానే విజయం వరించింది. అన్నట్లు 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలోనే టీమిండియా ఆస్ట్రేలియా చేతిలో ఓడి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయింది.

**ఆందోళనలో అభిమానులు.. కారణం ఇదే**

అయితే, 2024లో వెస్టిండీస్ వేదికగా సౌతాఫ్రికాను.. 2025లో దుబాయ్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీ విజేతగా నిలిచింది. అయితే, 2023 మాదిరే ఈసారి కూడా అదే అంపైర్ (ఇల్లింగ్‌వర్త్), అదే వేదిక (అహ్మదాబాద్)పై ఫైనల్ కావడంతో అభిమానులు కాస్త సెంటిమెంట్ ఫీలవుతున్నారు. దురదృష్టం వెంటాడకూడదని ప్రార్థిస్తున్నారు.

టీ20 ప్రపంచకప్–2026లో భారత్– న్యూజిలాండ్ ఫైనల్‌కు అంపైర్లు వీరే

ఆన్ ఫీల్డ్ అంపైర్లు– రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్

థర్డ్ అంపైర్– అల్లాఉద్దీన్ పలేకర్

ఫోర్త్ అంపైర్– అడ్రియాన్ హోల్డ్‌స్టక్

మ్యాచ్ రిఫరీ– ఆండీ పైక్రాఫ్ట్.



## సుశాంత్‌తో ప్రేమ .. గాసిప్స్‌పై మీనాక్షి చౌదరి క్లారిటీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్-రష్మిక వివాహం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అలాగే మార్చి 6న అల్లు శిరీష్-- నయనిక రెడ్డి వివాహం జరగనుండటంతో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితంపై కూడా కొన్ని గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వాటిపై స్పష్టత ఇచ్చారు. తన అందం, నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఆసక్తికర విషయం ఏమిటంటే, చాలా మంది నటీనటులు డాక్టర్ అవ్వాలని అనుకుని సినిమాల్లోకి వచ్చామని చెబుతుంటారు. కానీ మీనాక్షి మాత్రం నిజంగానే డెంటిస్ట్ చదివి తర్వాత సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ సినిమాల్లో ముందుకు సాగారు. 2019లో వచ్చిన హిందీ సినిమా అప్‌స్టార్ట్స్ ద్వారా మొదటిసారి తెరపై కనిపించిన మీనాక్షి, 2021లో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఖిలాడీ, హిట్: ది సెకండ్ కేసు, గుంటూరు కారం వంటి చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన లక్కీ భాస్కర్ ఆమెకు మంచి పేరు తెచ్చింది. అలాగే వెకంటేష్‌తో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం కూడా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఆమె పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న 'వృషకర్మ' సినిమాలో మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆమె లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో రిలేషన్‌లో ఉన్నారని గాసిప్స్ వినిపించాయి. ఆ హీరో మరెవరో కాదు సుశాంత్. వీరిద్దరూ కలిసి నటించినఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా షూటింగ్ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా స్పందించిన మీనాక్షి, వాటిని పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ప్రేమ సంబంధం లేదని, అతను మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువ కావడంతో మీనాక్షి టీమ్ కూడా స్పందించి ఇద్దరూ కేవలం ఫ్రెండ్స్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది.

## కృతి సనన్‌ను తక్కువ చేసి అవమానించాలన్నది నా ఉద్దేశం కాదు



బాలీవుడ్ నటీమణులు యామీ గౌతమ్, కృతిసనన్ మధ్య సోషల్ మీడియా వేదికగా వివాదం తలెత్తింది. ఇటీవల జరిగిన 'జీ సినీ అవార్డ్స్' వేడుకలో కృతి సనన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు.అయితే, ఈ గెలుపును విమర్శిస్తూ రూపొందించిన ఒక వీడియోకు యామీ గౌతమ్ 'లైక్' చేయడంతో నెట్టింట పెద్ద దుమారమే రేపింది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో, యామీ తాజాగా సోషల్ మీడియా ద్వారా క్లారిటీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. 'తేరే ఇష్క్ మే' చిత్రంలో నటనకు గానూ కృతి సనన్‌కు ఉత్తమ నటి అవార్డు దక్కిన విషయం తెలిసిందే. అయితే, 'హక్' సినిమాతో ఆ అవార్డుకు యామీ గౌతమ్ మరింత అర్హురాలని నెటిజన్లలో ఒక వర్గం అభిప్రాయపడింది. ఈ క్రమంలో, కృతి సనన్ గెలుపును తక్కువ చేస్తూ.. గతంలో యామీ ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ క్లిప్‌ను జోడిస్తూ ఇన్స్టాగ్రామ్‌లో ఒక వీడియో వైరల్ అయ్యింది. ఆ వీడియోలో యామీ, "అవార్డు వస్తేనే మంచి నటి అని కాదు.. నేను ఎవరి గుర్తింపును కోరుకోవడం లేదు" అని అన్న మాటలు ఉన్నాయి. ఈ వీడియోను యామీ లైక్ చేయడంతో, ఆమె కృతిపై అసూయతో ఉందని కొందరు విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో.. ఈ వివాదంపై స్పందిస్తూ, అది పొరపాటున జరిగిన 'లైక్' అని యామీ స్పష్టం చేశారు. "నేను ఒక నటిని కించపరిచేలా ఉన్న వీడియోను లైక్ చేశానని నా దృష్టికి వచ్చింది. ప్రతిరోజూ మమ్మల్ని వందలాది పోస్టుల్లో ట్యాగ్ చేస్తూ ఉంటారు. అవార్డు ఫంక్షన్ హడావిడిలో పొరపాటున ఆ వీడియోపై క్లిక్ అయి ఉండవచ్చు తప్ప, కావాలని చేసింది మాత్రం కాదు. నా కెరీర్‌లో ఎప్పుడూ ఇలాంటి చీప్ పీఆర్ టెక్నిక్స్ ఉపయోగించలేదు. నాకు అసలు పీఆర్ టీమే లేదు. అవార్డుల మీద నా అభిప్రాయం ఏంటో ఎప్పుడో చెప్పేశాను. నేను కేవలం నా పని మీద మాత్రమే దృష్టి పెడతాను. సోషల్ మీడియాలో వచ్చే గాసిప్స్ నమ్మవద్దు, నాకు అంతకంటే మంచి పేరు ఉందని ఆశిస్తున్నాను" అని ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు.

## నాగబంధం ఫస్ట్ సింగిల్.. అద్భుతమైన పోస్టర్ రిలీజ్ చేసిన మేకర్స్



మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియన్ మూవీ నాగబంధం అద్భుతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో ఔఎఐ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. మార్చి 15న ఉదయం 11:11 గంటలకు నాగబంధం ఫస్ట్ సింగిల్ "నమో రే" రిలీజ్ కానుంది. ఈ పాట నారాయణుడికి నివాళిగా ఆధ్యాత్మికత ప్రజెంట్ చేయబోతోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న నాగబంధంలో "నమో రే" సాంగ్ ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. ఈ పాటలో ఏకంగా 1,000 మంది డ్యాన్సర్లు పాల్గొంటూ, భారతీయ నృత్య కళల వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబించే అద్భుతమైన విజువల్ స్పెక్టాకిల్‌గా రూపొందించారు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్‌లో నభా నటేష్, ఐశ్వర్య మీనన్‌లు సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ అద్భుతంగా ఆకట్టుకుంటున్నారు. ఈ పాటను అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని ప్రతిబింబించే భారీ సెట్లో చిత్రీకరించడం ద్వారా విజువల్‌గా మరింత వైభవాన్ని అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. దీంతో సినిమాపై అంచనాలు పెరిగిపోగా.. వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న మరో కుర్ర హీరో.. త్వరలో ఆమెతో నిశ్చితార్థం?



టాలీవుడ్‌లో ఈ ఏడాది పెళ్లి సందడి కొనసాగుతోంది. వరుసగా యువ హీరోలు వివాహ బంధంలోకి అడుగుపెడుతుండగా, ఇప్పుడు మరో కుర్ర హీరో పెళ్లి వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ కుమారుడు, టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. కొన్ని నెలలుగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వివాహంపై వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన లాయర్ కుటుంబానికి చెందిన యువతి కావ్య రెడ్డితో ఆయన పెళ్లి జరగబోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కావ్య రెడ్డి తాతగారు జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యారని, ఆమె తండ్రి ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక ఈ వారంలోనే వీరిద్దరి నిశ్చితార్థం జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే బెల్లంకొండ కుటుంబం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినీ కెరీర్ విషయానికి వస్తే, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 2014లో వచ్చిన అల్లుడు శీను సినిమాతో హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత వరుసగా పలు సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది విడుదలైన భైరవం, కిష్కింధపురి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. ప్రస్తుతం ఆయన టైసన్ నాయుడు, హైందవ వంటి సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలు త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఒకవైపు కెరీర్‌లో కొత్త సినిమాలతో ముందుకు సాగుతూనే, మరోవైపు వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పెళ్లి వార్తలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో అన్నదానిపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

## గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన 'కార్మేని సెల్వం'



రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మిస్తున్న ఈ మూవీలో విలక్షణ నటులు సముద్రఖని, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలిపారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రానికి అధికారిక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్‌గా చేరింది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించింది. త్వరలో విడుదల కాబోయే టీజర్‌తో ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీని పెంచాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఈ చిత్రం నిజాయితీతో జీవించే ఒక సాధారణ కార్ డ్రైవర్ సెల్వం జీవితం చుట్టూ తిరుగుతుంది. ఆధునిక సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్ల మధ్య అతడు ఎలా ముందుకు సాగుతాడు అనే అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com